APTEL/25/A2082

# పతాకం న్యూస్

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 139 | విశాఖపట్నం | 19-2-2026 గురువారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 139 | VISAKHAPATNAM | 19-2-2026 THURSDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram

రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇన్‌చార్జ్: డి. లావణ్య

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902




## విశాఖ సాగర తీరంలో

# ఫ్లీట్ రివ్యూ

**(విశాఖపట్నం, పతాకం న్యూస్)**

విశాఖ సాగర తీరంలోని అంతర్జాతీయ నౌకాదళ సమీక్ష ప్రారంభమైంది. ప్రధానంగా ఆరు వరుసల్లో 71 యుద్ధ నౌకలు పరేడ్ నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విశేష అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రం నుంచి ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు పాల్గొన్నారు. వీరితో పాటు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, అడ్మిరల్ దినేశ్ త్రిపాఠి, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, తూర్పు నౌకా దళ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లాలు పాల్గొన్నారు. నేవీ సిబ్బంది గౌరవ వందనాన్ని రాష్ట్రపతి ముర్ము స్వీకరించారు. అనంతరం ఐఎన్ఎస్ సుమేధ నౌకపై రాష్ట్రపతితో పాటు గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎంలు ప్రయాణించారు. విశేషం ఏంటంటే ఈ కార్యక్రమంలో రష్యా, ఆస్ట్రేలియా, యూఏఈ తదితర దేశాల నుంచి వచ్చినటువంటి మొత్తం 19 విదేశీ నౌకలు, భారత నేవీకి చెందిన మరో 45 నౌకలు, కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీ, పరిశోధన నౌకలు ఒక 7 అంతర్జాతీయ యుద్ధనౌకలు సమీక్షలో పాల్గొనడం గమనార్హం. అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్షలో భాగంగా ఆర్కేబీచ్ ప్రధాన కేంద్రంగా సిటీ పరేడ్, నౌకాదళం విన్యాసాలు, ఫైర్, డ్రోన్ షోలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. యుద్ధనౌకల పరేడ్‌ను తిలకించిన ముర్ము: అంతర్జాతీయ యుద్ధ నౌకల సమీక్ష ప్రపంచ దేశాల మధ్య ఐక్యతకు, పరస్పర సహకారానికి అద్దం పట్టిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. విశాఖలో నిర్వహించిన అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష -2026లో పాల్గొన్న రాష్ట్రపతి భారత నౌకాదళం ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ సమర్థంగా పని చేస్తుందని రాష్ట్రపతి ముర్ము కితాబిచ్చారు. అంతర్జాతీయ (తరువాయి 2వ పేజీలో)



## జీవీఎంసీ జోన్-2 పరిధిలో యథేచ్ఛగా

# అక్రమ కట్టడాలు







- అడ్డగోలుగా అదనపు అంతస్తులు వేస్తున్న చోద్యం చూస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది
- జోన్2 పరిధిలో రెచ్చిపోతున్న బిల్డర్లు
- కాసులకు కక్కుర్తి పడుతున్న జోన్-2 ఏసీపీ శాస్త్రి
- అక్రమ కట్టడాలతో నిత్యం నరకం చూస్తున్న వాహనచోదకులు
- చేతుల మారుతున్న లక్షలాది రూపాయలు
- ఇంత జరుగుతున్న చోద్యం చూస్తున్న జీవీఎంసీ కమిషనర్
- పైసల్ ఇచ్చుకోండి.. అక్రమ నిర్మాణాన్ని కట్టుకోండి అంటున్న ఏసీపీ శాస్త్రి
- మధురవాడలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న అక్రమ కట్టడాలు



## జైలు నుంచి అంబటి రాంబాబు విడుదల

4లో




## రాష్ట్ర వ్యాప్తంగా శనగల కొనుగోళ్లు ప్రారంభం: అచ్చెన్నాయుడు

2లో

## మేం కూడా లడ్డూపై చర్చిద్దామనే

# కోరుతున్నాం: బొత్స



**అమరావతి, పతాకం న్యూస్:** ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి ప్రభుత్వంపై ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణ తీవ్ర విమర్శలు గుప్పించారు. మండలి మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ... తిరుమల లడ్డూ తయారీకి వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని అసత్య ప్రచారం చేస్తున్నారని, సీబీఐ దర్యాప్తులో ఎలాంటి కొవ్వు లేదని తేలిందని ఆయన అన్నారు. "ఇందాపూర్ ద్వారా దోచుకోవాలనేది చంద్రబాబు దుర్బుద్ధి. హోంమంత్రి వచ్చి ఏదేదో మాట్లాడుతున్నారు. మేం కూడా వాస్తవాలు తేల్చాలనే తిరుమల లడ్డూపై మండలిలో చర్చిద్దామని కోరుతున్నాం. ఇందాపూర్‌తో హెరిటేజ్ సంస్థ (తరువాయి 2వ పేజీలో)



## మోడీతో సుందర్ పిచాయ్ భేటీ

2లో

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## చిన్న స్కూళ్లు

గత పదేళ్లలో దేశంలో ఏకంగా 89,441 ప్రభుత్వ పాఠశాలలు మూతబడ్డాయి. ఈ మూతల్లో మధ్యప్రదేశ్ (29 410), ఉత్తర ప్రదేశ్ (25,126) రాష్ట్రాలు 60.9 శాతం వాటాతో ముందున్నాయి. దీన్ని సాక్షాత్తు కేంద్ర విద్యా శాఖ ఉప మంత్రి జయంత్ చౌదరి పార్లమెంటులో ప్రకటించారు. మన తెలుగు రాష్ట్రాలు ఈ "రికార్డును" 2015కు ముందే సాధించాయి! వీటిలో 9503 పాఠశాలలు అప్పటికే తలుపులు మూసేశాయి. ఇవన్నీ ప్రభుత్వ పాఠశాలలు. ప్రాథమిక పాఠశాలలు. చిన్న చిన్న పాఠశాలలు. గత ఐదేళ్ల నుంచి మన రాష్ట్రంలో మూసివేతలకు తోడుగా విలీనాలు, స్థాయి తగ్గింపులు, తరగతుల తరలింపులు, క్రమబద్ధీకరణలు, క్లస్టరైజేషన్లు ఇలా పలు నామధేయాల చర్యలతో ఊరి బడి సతమతమవుతోంది. ఎప్పుడు ఏ బడి ఏ రూపంలో వుంటుందో తెలీక వ్యవస్థ మొత్తం కకావికలైపోతోంది. లక్షల మంది పిల్లల్ని బలవంతంగా ఒక బడి నుంచి మరో బడికి తరలించడం ఆంధ్రప్రదేశ్‌లో తప్ప మరెక్కడా చూడనిది. ఈ పాట్లు పడలేక గత ఒక్క సంవత్సరంలోనే 2.63 లక్షల మంది పిల్లలు చరిత్రలో ఎప్పుడూ లేనట్టు ప్రైవేటు బాట పట్టారు. గత ప్రభుత్వం ఆరు రకాలుగా బడుల్ని విడగొడితే ఇప్పటి సర్కారు తొమ్మిది రకాల పాఠశాలల్ని తెస్తోంది. తలచుకుంటే భయమేస్తోంది. ఎందరు పిల్లలు జారుకుంటారో, ఎన్ని బడులు అదృశ్యమవుతాయోనని! విద్యారంగం మీద ఏ చర్చ జరిగినా ఇప్పుడు చిన్న స్కూళ్ళు వచ్చి ముందు నిలబడుతున్నాయి. వీటిని నానా శాపనార్థాలు పెడుతున్నారు. వీటిలో చదువు రాదనీ, ఒక్కో బిడ్డకు వ్యయం 40,000 అవుతుందనీ, పేదలు వీటిలో ఎందుకు చేరాలనీ ఎద్దేవా చేస్తున్నారు. నీతి ఆయోగ్ "మూడేళ్ల ఎజెండా" ఈ చిన్న స్కూళ్లపై రాష్ట్రాలు సాహసోపేత నిర్ణయాలు తీసుకోవాలంది. 'నూతన విద్యా విధానం' ఇంకొంచెం ముందుకెళ్లి వీటిలో సగటున 14 మందికి మించి పిల్లలు లేరనీ, వీటన్నింటికీ వసతులు కల్పించడం కష్టమనీ, వీటి నిర్వహణ భారమనీ, వీటి ఒంటరితనం పిల్లల మీద, టీచర్ల మీద, చదువుల మీద ప్రతికూల ప్రభావం చూపుతోందననీ చాంతాడంత దండకం చదివి, "ఈ సమస్యను 2025 నాటికి రాష్ట్రాలు అధిగమిం చాల్సి వుంది, దీనికి పలు మార్గాల్ని అన్వేషించించాల్సి వుంది" అని ముక్తాయించింది. ఉమ్మడి ఉపాధ్యాయుల నియామకం, స్థానిక సమాజాలకు అప్పగించడం, విలీనం చెయ్యడం లాంటి పరిష్కారాల్ని సూచించింది. వీటి మరణ శాసనం రాష్ట్రాలే రాయాలని చెప్పకనే చెప్పింది! చరిత్రలోకి వెళితే ఈ చిన్న స్కూళ్లను తెచ్చిందే ప్రపంచ బ్యాంకు! అదే మొదట భారతీయ పాఠశాల విద్యా రంగంపై 1980 నుంచి పుంఖాను పుంఖాలుగా సర్వేలు, అధ్యయనాలు చేసి, ప్రస్తుత విద్యా వ్యవస్థ పేద, మారుమూల పిల్లలందరికీ అత్యవసరంగా చదువు నేర్పడానికే మాత్రం సరిపోదంటూ పలు రకాల పరిష్కారాలను ముందుకు తెచ్చింది. వీటి కోసం ప్రాజెక్టులను తెచ్చి నిధులిచ్చింది. ఒక్క సంవత్సరం చదువుతో 13 శాతం కార్మికుల ఉత్పాదకత పెరుగుతుందని లెక్కలేసి ఊరించింది. భారత ప్రభుత్వం ఇప్పటికే తాత్సారం చేసిందనీ, అర్జంటుగా మేల్కొనాలని హెచ్చరించింది. ఇంతకూ ప్రపంచ బ్యాంకుకు కావలసింది పేద పిల్లలు అక్షరాస్యులు కావడం తప్ప విద్యావంతులు గావడం కాదు. దీనికి చిన్న స్కూళ్లు చాలు. ఒకసారి జనానికి చదువు రుచి తెలిస్తే వారే మంచి స్కూలు వెతుక్కుంటారనీ, ఆ రుచి చూపడమే ప్రభుత్వ కర్తవ్యమనీ కూడా ప్రపంచ బ్యాంకు ప్రవచించింది. దీనికనుగుణంగా "ఆపరేషన్ బ్లాక్ బోర్డు", "డిపిఇపి" లాంటి ప్రాజెక్టుల్ని రాష్ట్రాల నెత్తి మీదకెత్తింది. దీంతో కొన్ని రాష్ట్రాల్లో ప్రజలే నడుపుకొనే అనియత కేంద్రాల్లాంటి వేలాది పాఠశాలలు వెలిశాయి. ఇక ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయ బ్యాంకులు నేరుగా జోక్యం చేసుకొనే "ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ ప్రాజెక్టుకు" దేశంలోనే ముందుగా మన రాష్ట్రం శ్రీకారం చుట్టి ఈ పోటీలో ముందు నిలబడింది. దీంతో కాలనీలన్నిటా ఇబ్బడి ముబ్బడిగా స్కూళ్లు వెలిశాయి. అన్నీ ఒక గది, ఒక వరండా, ఒకటి టీచరు వుండే ప్రాణం లేని స్కూళ్లు. అక్షరం రుచి చూపడానికి మించి అక్కరకు రాని స్కూళ్ళు! 'అందుబాటులో బడి' అనేంతవరకివి సరిపోవచ్చు. మొదటి తరం గిరిజనుల్నీ, దళితుల్నీ బడికి రప్పించేందుకూ పనికొచ్చి వుండొచ్చు. 'ఆ బడి ఎలాంటి బడి? అందులో ఏం చదువొస్తుంది?' అంటే మాత్రం జవాబు లేదు. దీంతో పాటు ఊరిలోని పెద్ద బడి కూడా వున్న పిల్లలు చెల్లాచెదురై కాలనీ బడుల సరసన చేరింది! ఇప్పుడన్నీ చిన్నబడులే అయ్యాయి! ఈ ప్రమాదాన్ని 'ఎన్.యు.పి.ఇ.పి.ఎ' లాంటి సంస్థలు పసిగట్టి, ఎంత చెప్పినా ప్రాజెక్టుల యావలో పడి ప్రభుత్వాలేమీ పట్టించుకోలేదు. ఇప్పుడు మన రాష్ట్రంలో 12,512 ఏకోపాధ్యాయ పాఠశాలలుంటే వాటిలో 5495 పది లోపు పిల్లలవి! ఇక 20 లోపు పిల్లలవి 14,750 ప్రాథమిక పాఠశాలలు! గత సంవత్సరం ప్రైవేటు బాట పట్టిన పిల్లలు 2.63 లక్షల మంది! వీరిలో 1.8 లక్షల మంది ఈ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల వారే. ఇక ఐదో తరగతి పిల్లలకు మూడో తరగతి వాచకం చదవడం రాదని 'అసర్', ఐదేళ్లు బడికెళ్లినా 50 శాతానికి పఠన సంఖ్యాజ్ఞానాలు లేవని 'ప్రపంచ బ్యాంకు', సమస్యంతా పసలేని వానాకాలపు చదువులలోనే వుందని 'అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్' లాంటివి నిగ్గు తేల్చడం మొదలెట్టడంతో ఈ చిన్న స్కూళ్ల మీద నమ్మకం మరీ కునారిల్లసాగింది. ఒకవైపు పిల్లల చదువు పట్ల తల్లిదండ్రుల ఆకాంక్షలు ఎప్పుడూ ఎరగనంత పెరిగి, పేద వర్గాలు సైతం మంచి చదువుల కోసం వెతుకులాట మొదలెట్టడంతో, మరోవైపు ప్రైవేటు పాఠశాలల విస్ఫోటనంతో వీటి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఈ దుస్థితిని ఏమాత్రం అధ్యయనం చెయ్యకుండా గత ప్రభుత్వం అంగన్వాడీల్ని, ఒకటి రెండు తరగతుల్నీ కలిపి కొత్తగా ఫౌండేషన్ స్కూళ్ల వ్యవస్థను తీసుకొచ్చింది.

## రాష్ట్ర వ్యాప్తంగా శనగల కొనుగోళ్లు ప్రారంభం: అచ్చెన్నాయుడు




**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లోని శనగ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా 2025-26 రబీ సీజన్‌కు సంబంధించి శనగల కొనుగోలు ప్రక్రియను నేటి నుంచే రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వ ధరల మద్దతు పథకం కింద మొత్తం 94,500 మెట్రిక్ టన్నుల శనగలను సేకరించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ నుంచి ఆదేశాలు అందాయని, నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్ సంస్థల ద్వారా ఈ కొనుగోళ్లు జరుగుతాయని వివరించారు. కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేసేందుకు అన్ని జిల్లాల్లో సీఎం యాప్ ద్వారా పర్యవేక్షణ ఉంటుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ప్రతి జిల్లాలో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటైన జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీలు ఈ సేకరణను పర్యవేక్షిస్తాయని తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్, ఏపీ మార్క్‌ఫెడ్ వంటి అన్ని శాఖల సమన్వయంతో నేరుగా రైతు సేవా కేంద్రాల్లోనే కొనుగోళ్లను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రక్రియలో పూర్తి పారదర్శకత కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, స్వయం సహాయక సంఘాలను కూడా భాగస్వామ్యం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3.25 లక్షల హెక్టార్లలో శనగ పంట సాగు చేయగా, దాదాపు 3.77 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైతులు తమ పంటను విక్రయించేందుకు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. పంట కొనుగోలు చేసిన 15 రోజుల లోపే డబ్బులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమానికి తమ కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని అచ్చెన్నాయుడు పునరుద్ఘాటించారు.

## అన్నమయ్య జిల్లాలో చిన్నారిపై హత్యాచారం... చెరువులో శవమై తేలిన నిందితుడు



**అన్నమయ్య జిల్లా, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లాలో ఏడేళ్ల బాలికపై అత్యాచారం, హత్య కేసులో నిందితుడు పోలీసుల కస్టడీ నుంచి తప్పించుకుని, ఆ తర్వాత చెరువులో శవమై తేలాడు. ఈ దారుణ ఘటనకు పాల్పడిన కులవర్ధన్ (30) కురబలకోట మండలం కనసానిపల్లి చెరువులో మరణించి కనిపించడం తీవ్ర కలకలం రేపింది. నిందితుడిని మంగళవారం పోలీస్ వాహనంలో తరలిస్తుండగా తప్పించుకున్నాడని, అతని కోసం గాలింపు చర్యలు చేపట్టగా బుధవారం ఉదయం చెరువులో మృతదేహం లభ్యమైందని జిల్లా ఎస్పీ కె. ధీరజ్ మీడియాకు వెల్లడించారు. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం ఇది ఆత్మహత్యగా భావిస్తున్నామని, నిందితుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని తెలిపారు. వివరాల్లోకి వెళితే, మదనపల్లె పట్టణానికి చెందిన చేనేత కార్మికుడి ఏడేళ్ల కుమార్తె సోమవారం అదృశ్యమైంది. రెండో తరగతి చదువుతున్న ఆ చిన్నారి, పాఠశాలకు సెలవు కావడంతో ఇంటి దగ్గర ఆడుకుంటూ కనిపించకుండా పోయింది. పనుల నుంచి తిరిగి వచ్చిన తల్లిదండ్రులు, కుమార్తె కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు, బాధితురాలి పొరుగింట్లో ఉండే కులవర్ధన్‌కు నేరచరిత్ర ఉండటంతో అతనిపై అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు అతని ఇంటికి వెళ్లగా లోపలి నుంచి గడియ పెట్టి ఉండటంతో, కిటికీలోంచి చూడగా నిద్రపోతూ కనిపించాడు. అయితే, బాలిక చివరిసారిగా కులవర్ధన్‌తోనే కనిపించిందని మృతురాలి తాత చెప్పడంతో పోలీసులు మరుసటి రోజు ఉదయం ఇంట్లోకి ప్రవేశించి చూడగా, నీళ్ల డ్రమ్ములో బాలిక మృతదేహం లభ్యమైంది. వెంటనే కులవర్ధన్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో తప్పించుకు పారిపోయాడు. ఈ దారుణ ఘటనపై స్థానికంగా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ స్థానికులు జాతీయ రహదారిపై బైఠాయించి గంటల తరబడి రాస్తారోకో నిర్వహించారు. డీఐజీ కోయ ప్రవీణ్ మాట్లాడుతూ, పోస్టుమార్టం నివేదిక ప్రకారం నిందితుడు బాలికపై అత్యాచారం చేసి, ఆ తర్వాత నీటి డ్రమ్ములో ముంచి అత్యంత కిరాతకంగా హత్య చేశాడని వెల్లడించారు. నిందితుడిపై గతంలో సెక్షన్ 324 కింద కేసు నమోదైందని, అది లోక్ అదాలత్‌లో రాజీ అయినట్లు పోలీసులు తెలిపారు. అతను తరచూ మద్యం తాగి అసభ్యంగా ప్రవర్తించేవాడని స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనపై మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, బాధితురాలి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నిందితుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## మా సంక్షేమానికి బడ్జెట్లో నిధులను కేటాయించాలి : న్యాయవాదుల నిరసన

**తణుకు, పతాకం న్యూస్:** న్యాయవాదుల సంక్షేమానికి రూ.200 కోట్లు బడ్జెట్లో కేటాయించాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బడ్జెట్టుకు వ్యతిరేకంగా, న్యాయవ్యవస్థకు, న్యాయవాదుల సంక్షేమానికి నిధులు కేటాయించడంలో ప్రభుత్వం పట్టించుకోలేదంటూ బుధవారం తణుకు బార్ అసోసియేషన్ ఎదుట ఐలు ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా కామన మునుస్వామి మాట్లా డుతూ ... రాష్ట్రంలో న్యాయవాది వృత్తిలో 50 వేల మంది పని చేసుకుంటూ వారి జీవన విధానాన్ని కొనసాగిస్తున్నారని, అటువంటి న్యాయవాదులు రాష్ట్ర ప్రభుత్వానికి కోర్టు ఫీజు రూపంలో కోట్లాది రూపాయలు రాబడినీ చేకూరుస్తున్న ప్రభుత్వం న్యాయవాదుల సంక్షేమానికి ఒక రూపాయి కూడా కేటాయించలేదని విమర్శించారు.

## మోడీతో సుందర్ పిచాయ్ భేటీ




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** భారతదేశం ఒక గొప్ప సాంకేతిక పరివర్తనకు నాంది పలుకుతోందని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కీలక పాత్ర పోషించనుందని ఆల్ఫాబెట్, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ అన్నారు. ప్రస్తుత దశను పరివర్తన సమయంగా ఆయన అభివర్ణించారు. బుధవారం ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, "ఇది టెక్నాలజీ, ఆవిష్కరణలు, మరియు ఏఐ విస్తృత వినియోగంతో నడిచే ఒక దశాబ్ద కాలపు మార్పుకు నాందిలా అనిపిస్తోంది" అని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా లబ్ధి పొందేందుకు భారతదేశం ప్రత్యేకమైన స్థితిలో ఉందని, అయితే ఈ అవకాశంతో పాటు గొప్ప బాధ్యత కూడా ఉంటుందని సుందర్ పిచాయ్ నొక్కిచెప్పారు. ఏఐ పరిశోధనలలో బలమైన పెట్టుబడులు పెట్టాలని, దాని వినియోగాన్ని అన్ని రంగాలకు విస్తరించాలని ఆయన సూచించారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ, ఆర్థిక వ్యవస్థలోని ప్రతి విభాగానికి ఏఐ ప్రయోజనాలు చేరేలా పునాది స్థాయి నిర్మాణం జరగాల్సిన ఆవశ్యకతను ఆయన వివరించారు. గత కొన్నేళ్లుగా భారత్ డిజిటల్ రంగంలో అద్భుతమైన పురోగతి సాధించిందని పిచాయ్ ప్రశంసించారు. "భారతీయ వినియోగదారులు వాయిస్ ఆధారిత, ఇమేజ్ ఆధారిత సెర్చ్‌లను ప్రపంచంలోనే అత్యధికంగా స్వీకరిస్తున్నారు. ఇది దేశ ప్రజలు కొత్త టెక్నాలజీలను ఎంత వేగంగా అందిపుచ్చుకుంటున్నారో చూపిస్తోంది," అని ఆయన తెలిపారు. గూగుల్ ఏఐ టూల్ 'జెమినై'కి భారతదేశం అతిపెద్ద మార్కెట్లలో ఒకటిగా నిలవడం, ఇక్కడి వినియోగదారులలో ఏఐ పట్ల పెరుగుతున్న ఆసక్తిని ప్రతిబింబిస్తోందని అన్నారు. ఈ పర్యటనలో భాగంగా, సుందర్ పిచాయ్ ప్రధాని నరేంద్ర మోదీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఏఐ రంగంలో భారత్ సాధిస్తున్న పురోగతి, దేశంలోని ప్రతిభావంతులైన విద్యార్థులు, నిపుణులతో గూగుల్ ఎలా కలిసి పనిచేయగలదనే అంశాలపై వారు చర్చించారు.

(మొదటిపేజీ తరువాయి)

## అందుబాటులో ఉండాలి: లోకేశ్





యుద్ధనౌకల సమీక్షలో భాగంగా నిర్వహించిన 71 యుద్ధనౌకల పరేడ్‌ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తిలకించారు. భారత నౌకాదళం నుంచి 70కిపైగా యుద్ధనౌకలు, సబ్‌మెరైన్లు, కోస్టుగార్డు నౌకలు, 20 దేశాల నుంచి మరికొన్ని నౌకలు ఈ రివ్యూలో పాల్గొన్నాయి. విశాఖ నగరం నుంచి బీచ్‌రోడ్డుకు వచ్చే వారు కేజీహెచ్ డౌన్, పందిమెట్ట డౌన్, పాండురంగాపురం డౌన్‌తో పాటు వుడా పార్కు వైపు నుంచి విన్యాసాలు జరిగే ప్రాంగణానికి చేరుకోవచ్చు. ఏపీఐఐసీ స్థలం, కోస్టల్‌బ్యాటరీ, ఏయూ మైదానాల్లో వాహనాల పార్కింగ్‌కు అధికారులు అవకాశాన్ని కల్పించారు. బీచ్ వరకు రాలేకపోయిన వారికి సిటీ సెంట్రల్‌పార్క్, వుడా పార్క్, సిరిపురం కూడలి గురజాడ ప్రాంగణంలో భారీ ఎల్‌ఈడీ తెరలను ఏర్పాటు చేశారు. ఆర్కేబీచ్ నుంచి సబ్‌మెరైన్ మ్యూజియం వరకు 15 బ్లాకులను ఏర్పాటు చేశారు. పలు బ్లాకులకు అతిథులు, నౌకాదళం ఉద్యోగులు, ఇతర ముఖ్యులకు కేటాయించారు. బ్లాకుల్లోకి వెళ్లాలంటే ప్రతి ఒక్కరికీ పాస్ తప్పనిసరిగా ఉండి తీరాలి. యుద్ధనౌకల పరేడ్‌ను తిలకించేందుకు విశాఖ సాగర తీరానికి స్థానికులు పోటెత్తారు. నగరం నుంచి బీచ్‌రోడ్డుకు వచ్చే వారు కేజీహెచ్ డౌన్, పందిమెట్ట డౌన్, పాండురంగాపురం డౌన్‌తో పాటు వుడా పార్కు వైపు నుంచి విన్యాసాలు జరిగే ప్రాంగణానికి చేరుకోవచ్చు. ఏపీఐఐసీ స్థలం, కోస్టల్‌బ్యాటరీ, ఏయూ మైదానాల్లో వాహనాల పార్కింగ్‌కు అవకాశం కల్పించారు. బీచ్ వరకు రాలేకపోయిన వారికి సిటీ సెంట్రల్‌పార్క్, వుడా పార్క్, సిరిపురం కూడలి గురజాడ ప్రాంగణంలో భారీ ఎల్‌ఈడీ తెరలను ఏర్పాటు చేశారు. ఆర్కేబీచ్ నుంచి సబ్‌మెరైన్ మ్యూజియం వరకు 15 బ్లాకులను ఏర్పాటు చేశారు. ఆయా బ్లాకులకు అతిథులు, నౌకాదళం ఉద్యోగులు, ఇతర ముఖ్యులకు కేటాయించారు. బ్లాకుల్లోకి వెళ్లాలంటే ప్రతి ఒక్కరికీ పాస్ తప్పనిసరి.

## కోరుతున్నాం: బొత్స

చీకటి ఒప్పందం చేసుకుంది. సభలో బడ్జెట్‌తో పాటు ఇందాపూర్, హెరిటేజ్‌పై చర్చించాల్సిందే" అని బొత్స అన్నారు. తాము చెబుతున్న దాంట్లో అవాస్తవాలు ఉంటే వాస్తవాలను తేల్చడానికి చర్చకు రావాలని బొత్స సవాల్ విసిరారు. ఆధారాలతో సహా తాము నిరూపిస్తామని చెప్పారు. రూ.320కి కొనుగోలు చేసే నెయ్యిని రూ.700కి పెంచడం వెనుక ఉన్న కారణం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు చిత్తశుద్ధి ఉంటే చర్చకు రావాలని అన్నారు. వీళ్లు చేస్తున్న దోపిడీని బీజేపీ నేతలు సమర్థిస్తారా? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వానికి అధికారంలో ఉండే నైతికత లేదని అన్నారు. గతంలో తిరుమల లడ్డూ ఇస్తే భక్తులు కళ్లకు అద్దుకుని తినేవారని, ఇప్పుడు లడ్డూ ఇస్తే పరిశీలించి చూసి తింటున్నారని బొత్స చెప్పారు. మంత్రి నారా లోకేశ్ తెలిసీ తెలియక మాట్లాడుతున్నారని విమర్శించారు. తాము పట్టుకోల్పోయామనే భావనలో ఆయన ఉంటే ఉండనివ్వాలని... తమకు ఎలాంటి నష్టం లేదని అన్నారు.

# భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలి: ప్రేమకుమారి



**మల్కాపురం, పతాకం న్యూస్ :** భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించడం భారతదేశ ప్రత్యేకత అని, దానిని ప్రతి ఒక్కరు కాపాడాలని సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అన్నారు. జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొని, విజయవంతంగా తిరిగి వచ్చిన సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్- 2 వలంటీర్ కుమారి కొండా ఎస్తేరు రాణిని అభినందిస్తూ ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ- విభిన్న సంస్కృతుల లోని గొప్పతనాన్ని విద్యార్థులు అర్థం చేసుకోవాలని, జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. కుమారి ఎస్తేరు రాణి తమిళనాడులోని సేలంలో గల పెరియార్ యూనివర్సిటీ పరిధిలోని వివేకానంద ఆర్ట్సఅండ్ సైన్స్ మహిళా కళాశాలలో ఈ నెల 5వ,తేదీ నుండి11వ,తేదీ వరకు నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొని ఆంధ్రప్రదేశ్ యొక్క సాంస్కృతిక వైభవాన్ని చాటి చెప్పి, ఉత్తమ వలంటీర్ అవార్డు పొందిందని, ఇది కళాశాలకు ఎంతో గర్వకారణం అని- జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. ఈ అభినందన సమావేశంలో యూనిట్- 2 ప్రోగ్రాం అధికారి వై. అనసూయ దేవి, ఇతర ప్రోగ్రామ్ అధికారులు అంజలీదేవి, సంధ్య, నదియా తదితరులు పాల్గొని, ఎస్తేరును అభినందించారు. వాలంటీర్లు ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు.

## బగ్మారవలస- టోకూరు రోడ్డుకు మోక్షం



**అనంతగిరి, పతాకం న్యూస్:** మండలంలోని టోకూరు పంచాయతీ పరిధిలో గల బగ్మారవలస- టోకూరు రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన ఈ రోడ్డు అధ్వానంగా ఉండడంతో జాకవలస, సిసాముండ, టోకూరు, కపటివలస, షాడ, సింగర్భ, తదితర గ్రామాల గిరిజనులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. బొర్రా మెయిన్ రోడ్డు బగ్మారవలస నుంచి సిసాముండ మీదుగా టోకూరు పంచాయతీ కేంద్రానికి వెళ్లాలంటే వారంతా నరకం చూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ రహదారి నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు పంపించినా ఫలితం లేకపోయింది. కూటమి ప్రభుత్వంలో వచ్చిన తరువాత బగ్మారవలస నుంచి టోకూరు వరకు కిలోమీటరు మేర తారురోడ్డు నిర్మాణానికి రూ.75 లక్షలు మంజూరు చేసింది. దీంతో తమకు రవాణా కష్టాలు తీరతాయని సర్పంచ్ కిల్లో మోస్యతో పాటు పలు గ్రామాల గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ పూర్తయ్యేనా?




**కొయ్యూరు, పతాకం న్యూస్:** మండలంలో డౌనూరు కేంద్రంగా గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన సమీకృత కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ గత మూడేళ్లుగా పిల్లర్లకే పరిమితమైంది. మండలంలో డౌనూరు కేంద్రంగా కాఫీ క్యూరింగ్, రోస్టింగ్, గ్రైండింగ్, ప్యాంకింగ్ చేసేందుకు రూ.4 కోట్ల వ్యయంతో సమీకృత కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణానికి అప్పటి రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖామంత్రి శంకుస్థాపన చేసి ఆరు నెలల్లో నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. అయితే నిధులు విడుదల చేయకపోవడంతో పిల్లర్ల స్థాయిలో నిర్మాణాలు నిలిచిపోయాయి. ఈ యూనిట్ నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వచ్చి ఉంటే కాఫీ పండించే రైతులు దళారుల బారిన పడకుండా నేరుగా జీసీసీకి విక్రయించి లాభాలు ఆర్జించే వారు. అంతే కాకుండా కాఫీ క్యూరింగ్, రోస్టింగ్, ప్యాకింగ్ తదితర పనులకు స్థానిక మహిళలకు ఉపాధి దొరికేది. ఇవేమీ జరగకపోవడంతో స్థానికులు నిరాశ చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఈ యూనిట్ నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

## గొట్టిపల్లి హైస్కూల్‌ను సందర్శించిన డీఈవో



**ఆనందపురం, పతాకం న్యూస్:** గొట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రేమ్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా పదవ తరగతి ప్రీ-ఫైనల్ సోషల్ పరీక్ష నిర్వహణను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. అనంతరం అసెస్‌మెంట్ పుస్తకాలను పరిశీలించారు. పాఠ్యబోధన మెరుగుదలపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాలలో జరుగుతున్న ముస్తాబు కార్యక్రమం, విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులు, గ్రంథాలయాన్ని పరిశీలించారు. తదుపరి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పందిరి కనకేశ్వరరావు, ఉపాధ్యాయులతో సమావేశమై విద్యా ప్రమాణాల పెంపు, పరీక్షల ఫలితాల్లో మెరుగుదల సాధించే విధానాలపై అవసరమైన సలహాలు అందించారు.

## మాచ్‌ఖండ్‌లో విద్యుదుత్పత్తి నిలిపివేత



**ముంచంగిపుట్టు, పతాకం న్యూస్:** ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తిని ప్రాజెక్టు అధికారులు నిలిపివేశారు. విద్యుదుత్పాదనకు అవసరమైన మేరకు టీపీ (టర్నల్ పాయింట్) డ్యామ్ నుంచి నీరు సరఫరా కాకపోవడమే అందుకు కారణంగా వెల్లడించారు. నీటి సరఫరా ఎందుకు జరగడంలేదని అధికారులు టీపీ డ్యామ్, సొరంగ మార్గాన్ని పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో నీటిని శుద్ధి చేసే ఇనుప జాలీల వద్ద చెత్తా చెదారం పేరుకు పోవడాన్ని గుర్తించారు. వెంటనే నీటి సరఫరాను, విద్యుదుత్పాదనను నిలిపివేశారు. ప్రాజెక్టు ఈఈ (జనరేషన్) బి.గోవిందరాజులు ఆధ్వర్యంలో చెత్తాచెదారం తొలగించే పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. గత కొద్దిరోజులుగా ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో విద్యుదుత్పాదన జరుగుతోంది. అయితే టీపీ డ్యాం, కెనాల్‌లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో విద్యుదుత్పాదనకు అర్ధంతరంగా బ్రేక్ పడింది. మొత్తం ఆరు జనరేటర్ల సహాయంతో 120 మెగావాట్ల ఉత్పత్తి చేసే సామర్థ్యం ఈ ప్రాజెక్టుకు ఉంది. బుధవారం సాయంత్రం నాటికి విద్యుదుత్పాదన పునఃప్రారంభించే అవకాశం ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

## అంత్రిగుడ మలుపు వద్ద తరచూ ప్రమాదాలు



**డుంబ్రిగుడ, పతాకం న్యూస్:** జాతీయ రహదారి 516-ఈపై ప్రయాణమంటే వాహనచోదకులు హడలిపోతున్నారు. ముఖ్యంగా మండలంలోని అంత్రిగుడ మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పర్యాటకులకు ఈ మార్గంపై అవగాహన లేకపోవడంతో వేగంగా వస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. పర్యాటకులు అరకులోయలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించిన తరువాత చాపరాయి జలవిహారికి వస్తుంటారు. దీంతో జాతీయ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. మండలంలోని అంత్రిగుడ వద్ద ప్రమాదకర మలుపు ఉండడంతో ఈ మార్గంపై అవగాహన లేని పర్యాటకులు వేగంగా వస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. గత నెల 24న రెండు ద్విచక్ర వాహనాలు ఈ మలుపు వద్ద ఢీకొనడంతో ఒక యువకుడు మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ నెల 13న రెండు ద్విచక్ర వాహనాలు ఈ మలుపు వద్ద ఢీకొనడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. గతంలో ఇదే మలుపు వద్ద 11 ప్రమాదాలు జరిగాయని స్థానికులు చెబుతున్నారు. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి మలుపు వద్ద సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని పర్యాటకులు కోరుతున్నారు

## రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



**ఆమదాలవలస, పతాకం న్యూస్:** శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్ సమీపంలో రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు జీఆర్పీ ఎస్ఐ మధు సూదనరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. రైల్వేస్టేషన్ సమీపాన కుద్దిరాం గ్రామం వద్ద ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. స్థానికులు సమా చారం మేరకు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా.. మృతి చెందిన వ్యక్తి వయసు సుమారు 40 ఏళ్లు ఉంటుందన్నారు. గళ్ల చొక్కా, నలుపు రంగు ఫ్యాంట్ ధరించి ఉన్నాడని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని శ్రీకాకుళం సర్వజన ఆసుప త్రికి తరలించినట్టు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఆమదాలవలస జీఆర్పీ పోలీస్ స్టేషన్‌లో సంప్రదిం చాలని కోరారు.

## వెంకటాపురంలో ఎంపీడీవో పర్యటన



**పద్మనాభం, పతాకం న్యూస్:** మండలంలోని వెంకటాపురం గ్రామంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.రూపేష్ పర్యటించారు. వెంకటాపురం గ్రామ పంచాయతీలో డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపైకి చేరి ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్నట్లు ఆయన పరిశీలించారు. కొంతమంది గ్రామస్తులు తమ ఇంటి వినియోగ నీటిని నేరుగా రోడ్డు మీదకు వదులుతున్నట్లు గుర్తించారు. ఇలాంటి చర్యల వల్ల అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వెంటనే ఈ విధానాన్ని మార్చుకోకపోతే చర్యలు తీసుకుంటామని సంబంధిత వ్యక్తులకు హెచ్చరికలు జారీ చేశారు. డ్రైనేజీలలో పేరుకుపోయిన పూడికను వెంటనే తొలగించి, రోడ్లపై నిలిచిన నీటిని క్లియర్ చేయాలని వెంకటాపురం గ్రామపంచాయతీలో ఖాళీగా ఉన్న గ్రీన్ అంబాసిడర్ పోస్టును భర్తీ చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

## గూగుల్‌కు భూసేకరణ పూర్తి



**ఆనందపురం, పతాకం న్యూస్:** ఆనందపురం మండలం తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్‌కు భూసేకరణ పూర్తయింది. ఇప్పటివరకు భూమి ఇవ్వని దివ్యాంగుడైన రైతు గణేశ్ కూడా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చొరవతో తన అంగీకార పత్రాలను మండల రెవెన్యూ అధికారులకు సమర్పించారు. దీనికి ముందు ఆయన భీమిలి బాలికల గురుకుల పాఠశాల కార్యక్రమంలో పాల్గొన్న గంటా శ్రీనివాసరావును కలిసి ప్రభుత్వం నుంచి తనకు అదనంగా పరిహారం ఇప్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తనకున్న 1.94 ఎకరాల భూమిని గూగుల్ కంపెనీ కోసం ఇస్తున్నట్టు పత్రాలు ఎమ్మెల్యేకు చూపించారు. వాటిని మండల రెవెన్యూ అధికారులకు వెంటనే ఇవ్వాలని సూచించగా కుటుంబంతో సహా వెళ్లి ఆనందపురం తహసీల్దార్‌కు అందజేశారు. తర్లువాడలో ప్రభుత్వం గూగుల్ కోసం మొత్తం 308 ఎకరాలు సేకరించినట్టయింది. తహసీల్దార్ శ్రీనుబాబు మాట్లాడుతూ, దీంతో భూసేకరణ పూర్తయిందన్నారు. గూగుల్‌కు రైతులు భూములు ఇవ్వకుండా చేసేందుకు వైసీపీ నాయకులు కుట్రలకు దిగారు. బినామీలను రంగంలో దించి ప్రభుత్వం కంటే ఎక్కువ మొత్తం ఇస్తామని వారికి ఆశ పెట్టారు. దీంతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌లు తర్లువాడ వెళ్లి ఎకరా ప్రభుత్వ ధర రూ.17 లక్షలు ఉండగా దానిని పరిహారం కోసం రూ.20 లక్షలు చేశారు. ఇంటికో ఉద్యోగం, ఉపాధి కోసం వాణిజ్య సముదాయంలో షాపు, 520 మంది రైతులకు మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు, ఇప్పించారు. దీంతో తర్లువాడ మాజీ సర్పంచ్, వైసీపీ నాయకుడు మజ్జి వెంకటరావు కూడా భూములు ఇవ్వడానికి ముందుకు వచ్చారు. ఆఖరి రైతు కూడా భూమి ఇవ్వడంతో వైసీపీ కుట్రకు చెక్ చెప్పినట్టయిందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

## పోస్టాఫీసు పొదుపు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



**ఆనందపురం, పతాకం న్యూస్:** కేంద్ర ప్రభుత్వం పోస్టల్ శాఖ ద్వారా అందిస్తున్న వివిధ పొదుపు పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విశాఖ నార్త్ సబ్‌డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ (ఐపిఒ) జి.జగదీశ్వరరావు కోరారు. రెడ్డిపల్లి సబ్ పోస్టాఫీస్ పరిధిలోని కుశులువాడ, శిర్లపాలెం గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి గ్రామీణ ప్రజలకు పోస్టల్ పొదుపు పథకాలపై అవగాహన కల్పించారు. సుకన్య సమృద్ధి యోజన ఆడపిల్లల భవిష్యత్‌కు అత్యుత్తమమైన పథకమని, దీనిపై 8.2 శాతం వడ్డీ లభిస్తుందని తెలిపారు. సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ ద్వారా 60 ఏళ్లు పైబడిన వారికి 8.2 శాతం వడ్డీతో త్రైమాసిక ఆదాయం అందుతుందని చెప్పారు. నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్‌పై 7.7 శాతం వడ్డీతో ఐదేళ్లకు సురక్షితమైన పెట్టుబడి లభిస్తుందని, కిసాన్ వికాస్ పత్రలో పెట్టిన డబ్బు సుమారు 115 నెలల్లో రెట్టింపు అవుతుందని వివరించారు. పోస్ట్ ఆఫీస్ మంత్లీ ఇన్కమ్ స్కీమ్ ద్వారా 7.4 శాతం వడ్డీతో నెలవారీ స్థిర ఆదాయం పొందవచ్చని, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్‌లో 7.1 శాతం వడ్డీతో దీర్ఘకాలిక పన్ను రహిత పొదుపు సాధ్యమవుతుందని తెలిపారు. రికరింగ్ డిపాజిట్‌పై 6.7 శాతం వడ్డీతో నెలసరి పొదుపు, టైమ్ డిపాజిట్ పథకాలపై ఒకటి నుంచి ఐదేళ్ల కాలానికి 6.9 నుంచి 7.5 శాతం వరకు వడ్డీ లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కుశులువాడ, శిర్లపాలెం, గొట్టిపల్లి బిపిఎంలు కె.ప్రసన్న, టి.అచ్చితరావు, ఎస్‌వైఇడి, నూర్జహాన్, ఎబిపిఎం డబ్బీరు శ్రీనివాసరావు, రెడ్డిపల్లి సబ్ పోస్టాఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## 15 కిలోల పాలిథిన్ సంచులు స్వాధీనం

**భీమిలి, పతాకం న్యూస్:** జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో పలు మాంసం దుకాణాలు, కిరాణా దుకాణాల్లో ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఆయా దుకాణాల యజమానుల నుంచి 15 కిలోల పాలిథిన్ సంచులను స్వాధీనం చేసుకుని, జరిమానా విధించారు. ప్రజారోగ్య విభాగం శానిటరీ సూపర్‌వైజర్ బి.మహాలక్ష్మి నాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.శివ, మేస్త్రి ఆర్.రవి, వార్డు సచివాలయాల కార్యదర్శులు మనోజ్, త్రివేణి, ప్రసాద్, సురేష్ పాల్గొన్నారు.

## గుర్ల గెడ్డ రిజర్వాయర్ భూములను పరిశీలిస్తున్న ఎస్ఈ అప్పలనాయుడు బృందం



**మెంటాడ, పతాకం న్యూస్:** గుర్ల గెడ్డ రిజర్వాయర్‌కు మంచిరోజులు రానున్నాయి. మంత్రి సంధ్యారాణి చొరవతో ఈ జలాశయం ఆయకట్టు రైతుల దశాబ్దాల ఎదురుచూపులు ఫలించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ రిజర్వాయర్ పూర్తికి రూ.17 కోట్లు అవసరమని ఇరిగేషన్ అధికారులు గత ఏడాది ప్రతిపాదనలు పంపారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు ఈ ప్రాజెక్టు స్థితిగతులను పరిశీలించారు. మెంటాడ మండలంతో సహా అల్లూరి సీతారామరాజు జిల్లా సరిహద్దున ఉన్న అనంతగిరి మండలంలో పది గ్రామాలకు చెందిన 2,900 ఎకరాల ఆయుకట్టుకు సాగునీరు అందించే లక్ష్యంతో 2000లో రూ.4కోట్ల 30 లక్షల అంచనా వ్యయంతో గుర్ల గెడ్డ మినీ రిజర్వాయర్ పనులు ప్రారంభించారు. ప్రాజెక్టు కోసం 268 ఎకరాలు అవసరమని గుర్తించారు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమి 138 ఎకరాలు కాగా రైతుల నుంచి 130 ఎకరాలు సేకరించారు. ప్రారంభంలో పనులు చురుగ్గా సాగినా నిధుల సర్దుబాటు కారణంగా కొన్నాళ్లకు పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. సర్‌ప్లస్ వాల్, కుడి, ఎడమ కాలువల నిర్మాణం 90 శాతం పూర్తి చేసుకున్నప్పటికీ వాటి ద్వారా ఆయుకట్టుకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. రిజర్వాయర్ పూర్తిచేయాలని పలు పర్యాయాలు రైతులు ప్రజాప్రతినిధులకు విన్నవించారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా వున్న గుమ్మిడి సంధ్యారాణి చొరవ చూపడంతో ప్రాజెక్టు పనులు ముందుకు సాగే అవకాశాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఈ ప్రాజెక్టు స్థితిగతుల పరిశీలనకు జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ అప్పలనాయుడు బృందం వచ్చింది. పరిశీలన అనంతరం త్వరలో మినీ రిజార్వాయర్ పనులు ప్రారంభమౌతాయని ఓ అధికారి సూచన ప్రాయంగా చెప్పడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈసందర్భంగా ఎస్ఈ అప్పలనాయుడు మాట్లాడుతూ, రూ.17 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. త్వరలో ఈ పనులు ప్రారంభించనున్నట్టు చెప్పారు. పర్యటనలో ఈఈ ఎంవీ రమణ, డీఈ నవీన్, రామునాయుడు, రైతు సంఘం నాయకుడు రాములు, రాజప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన దివ్యాంగులకు
# పెన్షన్లు ఎప్పుడిస్తారు?



**విజయనగరం, పతాకం న్యూస్:** బంధువులు మోసుకుంటూ తీసుకొస్తున్న ఆమె పేరు కందుకూరి సుందరమ్మ(70) సాలూరు పట్టణంలో నివాసం ఉంటుంది. కాళ్లు, చేతులు పని చేయకపోవడంతో కొన్నాళ్లుగా మంచం పట్టి చికిత్స పొందుతోంది. వంద శాతం వైకల్యం ఉన్నట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రస్తుతం దివ్యాంగ పింఛన్ రూ.6 వేలు వస్తుంది. రూ.15 వేల పింఛన్ మంజూరు చేయాలని ఆమె బంధువులు గతనెలలో సాలూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ ఎస్‌లో కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. అన్నదమ్ములైన జవానా వైకుంఠం(17), వినయ్(14)కు కొన్నేళ్లుగా కాళ్లు చచ్చుబడిపోయాయి. దీంతో మంచానికే పరిమితమయ్యారు. తల్లి ఈశ్వరమ్మ పట్టణంలోని ఓ ప్రైవేట్ షాపులో పని చేసుకుంటూ వారిని పోషిస్తోంది. ఆ అన్నదమ్ములకు దివ్యాంగ పింఛన్ కింద ప్రతినెలా రూ.ఆరు వేల చొప్పున ఇస్తున్నారు. మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేల పింఛన్ మంజూరు చేయాలని ఈశ్వరమ్మ గత నెల 31న మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని వేడుకుంది. పట్టణంలో మెంటాడ వీధిలో ఉంటున్న యువకుడు పేరు పతేడ వంశీకృష్ణ (20)కు పుట్టిన నాటి నుంచి కాళ్లు, చేతులు పని చేయడం లేదు. పూర్తిగా మంచానికే పరిమితమైన వంశీకి తల్లి జ్యోతి, తండ్రి రాము నిత్యం సేవలు చేస్తున్నారు. ప్రస్తుతం ఆ యువ కుడికి దివ్యాంగ పింఛన్ రూ.6 వేలు వస్తుంది. కాగా గతంలో వంద శాతం వైకల్యం ఉన్నట్లు అధికారులు ధ్రువపత్రం మంజూరు చేయగా.. ఇటీవల జరిగిన సదరంలో మాత్ర పది శాతం తగ్గించారు. దీంతో ఆ బాధిత కుటుంబం తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తోంది. .. ఇలా జిల్లాలో ఎంతోమంది అర్హులైన దివ్యాంగులు రూ.15వేల పింఛన్ కోసం ఎదురు చూస్తున్నారు. పూర్తిగా మంచానికే పరిమితమైన వారికి కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని బాధిత కుటుంబాలు కోరుతున్నారు. అదే విధంగా నేటికీ దివాంగ పింఛన్లు పొందుతున్న అనర్హులపై వేటు వేయాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు వృద్ధాప్య, దివ్యాంగ, వితంతు, పూర్తిగా మంచానికే పరిమితమైన రోగులకు పింఛన్ మంజూరు చేయడంలో క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం చూపిస్తున్నారే విమర్శలు కూడా లేకపోలేదు. పూర్తిస్థాయిలో మంచానికి పరిమితమైన లబ్ధిదారులకు పెన్షన్లు అందడం లేదనే విమర్శలు ఉన్నాయి. జిల్లాలో ఎన్టీఆర్ భరోసా కింద ప్రతినెలా దాదాపు లక్షా 38 వేల మందికి వివిధ రకాల పింఛన్లు అందిస్తున్నారు. వారిలో 71 వేల మంది వృద్ధులు, 37,898 మంది వితంతువులు, 16,115 మంది దివ్యాంగులు ఉన్నారు. పూర్తిగా మంచానికి పరిమితమైన 63 మందికి రూ.15 వేల చొప్పున అందజేస్తున్నారు. వాస్తవంగా ఇటువంటి వారి సంఖ్య జిల్లాలో ఎక్కువగానే ఉంది. అయితే అనర్హులు దివ్యాంగ పింఛన్లు పొందుతుండడంపై జిల్లా ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో కూటమి ప్రభుత్వం నకిలీ పింఛన్ల ఏరివేతకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు ప్రత్యేకంగా వైద్య బృందాలను నియమించి.. తనిఖీలు చేపట్టింది. ఆసుపత్రుల్లో సదరం క్యాంపులను కూడా నిర్వహించి.. దివ్యాంగ పింఛన్‌దారులకు వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టింది. అయితే త్వరితగతిన అనర్హులను తేల్చి.. తమకు న్యాయం చేయాలని అర్హులైన దివ్యాంగ పింఛన్‌దారులు కోరుతున్నారు.

# శ్రీకాకుళంలో నత్తనడకన కుటుంబ సర్వే..



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే జిల్లాలో నత్తనడకన సాగుతోంది. ఓ వైపు సాంకేతిక సమస్యలు.. మరోవైపు వేధిస్తున్న సిబ్బంది కొరత.. ఇంకోవైపు ప్రజల నుంచి ఆశించినస్థాయిలో స్పందనలేక సర్వే సక్రమంగా సాగడం లేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్ల ద్వారా ఈ సర్వే చేపట్టగా.. ఇష్టానుసారంగా వివరాలు నమోదు చేశారనే విమర్శలు ఉన్నాయి. కుటుంబ మ్యాప్ కూడా తప్పులతడకగా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. స్థానికంగా కుటుంబాలు లేకపోయినా ఉన్నట్లు మ్యాపింగ్ చేసేశారు. అప్పట్లో తప్పుల సవరణకు అవకాశం ఇవ్వలేదు. గత ప్రభుత్వ తప్పిదాల కారణంగా ప్రస్తుత కూటమి పాలనలో అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ, తల్లికివందనం, ఆటోడ్రైవర్ల సేవలో తదితర సంక్షేమ పథకాలకు చాలామంది దూరమయ్యారు. దీంతో సచివాలయ సిబ్బందితో సమగ్ర సర్వే ద్వారా వీటన్నింటినీ సరిచేసి.. ఫ్యామిలీ బెనిఫిట్ కార్డులు ఇవ్వాలని సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయించారు. ఈ మేరకు ప్రత్యేక యాప్‌ను రూపొందించి.. గతేడాది డిసెంబరులో యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే ప్రారంభించారు. జనవరి పదో తేదీలోగా సర్వే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్‌లో ఏ పథకం వర్తింపజేయాలన్నా లబ్ధిదారుల వివరాలు పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. కాగా సర్వే సకాలంలో పూర్తికాకపోవడంతో గడువు ఈ నెల పదో తేదీ వరకూ పొడిగించారు. అయినప్పటికీ జిల్లాలో సోమవారం నాటికి 59.27 శాతం మాత్రమే సర్వే పూర్తయింది. జిల్లాలో 7,36,450 కుటుంబాలు ఉండగా, ఇప్పటివరకు 4,36,521 కుటుంబాల సర్వే (59.27) పూర్తయింది. జిల్లాలో అత్యధికంగా బూర్జ మండలంలో 14,206 కుటుంబాలకుగాను 11,669 కుటుంబాల సర్వే పూర్తిచేశారు. శ్రీకాకుళం కార్పొరేషన్‌లో 42,181 కుటుంబాలు ఉండగా, అందులో 21,065 కుటుంబాల సర్వే మాత్రమే (49.96శాతం) చేశారు. శ్రీకాకుళం రూరల్‌లో 33,863 కుటుంబాలు ఉన్నాయి. 17,977 కుటుంబాల సర్వే (53.01శాతం) చేశారు. శ్రీకాకుళం అర్బన్‌లో 50.06 శాతం కుటుంబాలను సర్వే చేయాల్సి ఉంది.

## పకడ్బందీగా టెన్త్ పరీక్షలకు చర్యలు



**బొబ్బిలి, పతాకం న్యూస్:** వచ్చేనెల 15 నుంచి పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిం చేందుకు చర్యలు చేపడుతున్నామని తహసీల్దారు మలపురెడ్డి శ్రీను అన్నారు. పట్టణం, మండలంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఆయన నేతృత్వంలో అధికారుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా తహసీల్దారు విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. పరీక్షల నిర్వహణాధికారులకు సూచనలిచ్చారు. అనం తరం ఆయన మాట్లాడుతూ అన్ని పరీక్షాకేంద్రాలలో మౌలిక సదుపాయాలు కచ్చితంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యార్థులకు సరైన గాలి, వెలు తురు ఉండేలా చూడాలన్నారు. తాగునీరు, వైద్య సదుపాయం అందు బా టులో ఉంచాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా జన రేటర్ సదుపాయం కల్పించాలన్నారు. పరీక్షలకు హాజరవుతున్న విద్యా ర్థులు ఎటువంటి మానసిక ఒత్తిడి గురికాకుండా ఏకాగ్రతతో చదువుపై దృష్టి సారించాలన్నారు. విద్యార్థులపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట ఎంఈవో-2 గొట్టాపు వాసు, ఏఎస్ఐ సన్యాసి రావు, పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్యులు అందుబాటులో ఉండాలి: డీసీహెచ్ఎస్




**నరసన్నపేట, పతాకం న్యూస్:** వైద్యులు ఆసుపత్రిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని డీసీహెచ్ఎస్ కేఎన్ విజయలక్ష్మి కోరారు. నరసన్నపేట ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేశారు. విధుల్లో చేరిన రెండోరోజు నరసన్నపేట ఆసుపత్రిలో వైద్యులు హాజరు, చైల్డ్‌వార్డును పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే సమయానికి కొందరు వైద్యులు, సిబ్బంది బయటకు వెళ్లగా డీసీహెచ్ఎస్ తనిఖీ చేస్తున్నారని సమాచారం మేరకు ఉరుకులు..పరుగులతో చేరారు. అనంతరం వైద్యులతో ఆమె సమావేశం నిర్వహించారు. నిబంధనలు మేరకు ఆసుపత్రిలోనే వైద్యులు, సిబ్బంది ఉండాలని, హాజరు వేసి సొంత క్లినిక్‌లకు వెళ్లరాదని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌బాబు, వైద్యులు రమేష్, రెడ్డి భార్గవ్, మెండ సుధారాణి, చల్లా కృషి పాల్గొన్నారు.

## జైలు నుంచి అంబటి రాంబాబు విడుదల



**గుంటూరు, పతాకం న్యూస్:** వైసీపీ ముఖ్య నేత.. మాజీ మంత్రి అంబటి రాంబాబు జైలు నుంచి విడుదల అయ్యారు. వరుస కేసుల్లో ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. చంద్రబాబు పైన అనుచిత వ్యాఖ్యలతో అరెస్ట్ అయిన అంబటి పైన గతంలో నమోదు అయిన కేసుల్లోనూ అరెస్ట్ చేసారు. కాగా, జనసేన నేత నమోదు చేసిన కేసులో ఈ రోజు అంబటికి బెయిల్ వచ్చింది.దీంతో, జైలు నుంచి బయటకు వచ్చిన అంబటి రాంబాబు ప్రభుత్వ తీరు పైన ఆగ్రహం వ్యక్తం చేసారు. తనను బయటకు రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. వైసీపీ నేత అంబటి రాంబాబు జైలు నుంచి విడుదల అయ్యారు. చంద్రబాబు పైన అనుచిత వ్యాఖ్యలు చేసిన అంబటి రాంబాబు పైన కేసు నమోదు అయింది. ఈ కేసులో ఆయన రాజమండ్రి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. కాగా.. ఈ కేసులో కొద్ది రోజుల క్రితం రాంబాబుకు బెయిల్ లభించింది. కాగా, అదే సమయంలో మెడికల్ కాలేజీల పీపీపీ విధానానికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించిన సమయంలో పోలీసులతో దురుసుగా వ్యవహరించటం.. అధికారుల విధులకు అడ్డంకి కలిగించారనే కేసు తెర మీదకు వచ్చింది. విచారణ తరువాత ఆ కేసులోనూ అంబటికి బెయిల్ వచ్చింది. ఆ వెంటనే జనసేన జిల్లా అధ్యక్షుడు అంబటి మంత్రిగా ఉన్న సమయంలో సత్తెనపల్లిలో లక్కీ డ్రా పేరుతో మోసం చేసారనే ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదైంది. ఈ కేసులో తాజాగా రిమాండ్ విధించారు. దీంతో, ఈ రోజు వరకు అంబటి రాజమండ్రి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈ రోజు ఈ కేసులోనూ బెయిల్ లభించింది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. 18 రోజుల పాటు రాజమండ్రి సెంట్రల్ జైల్లో తాను ఉన్నానని చెప్పుకొచ్చారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ కక్షగట్టి తనను జైల్లో పెట్టారని ఆరోపించారు.

## టీడీపీ నేత దుర్భాషలపై కార్యదర్శుల నిరసన



**రేగిడి, పతాకం న్యూస్:** మండలంలోని చిన్నశిర్లాం పంచాయతీ కార్యదర్శి వి.బిందుశేఖర్‌ను ఇదే గ్రామ టీడీపీ నేత, తెలుగు యువత మండల అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అసభ్య పదజాలంతో దుషించ టంపై మండల పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. యూనియన్ ప్రతినిధులు ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాల యం ముందు కాసేపు బైఠాయించి, నిరసన తెలిపారు. ఉద్యోగులపై మానసిక, రాజకీయ వేధింపులు తగవని హెచ్చరించారు. వీరికి మండల పరిషత్ ఉద్యోగులు సంఘీభావం తెలిపారు.

## పీఏసీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



**పలాస, పతాకం న్యూస్:** అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేసే వరకూ పోరాటం చేస్తామని పీఏసీఎస్ ఉద్యోగులు తెలిపారు. స్థానిక పీఏసీఎస్ ఉద్యోగులు రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా ఇక్కడ కూడా సమ్మెను కొనసాగించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవో-36ను వెంటనే అమలుచేసి పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ అమలుచేయాలని, పీఏసీఎస్ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలు అమలుచేయాలని, ఉద్యోగికి ఆరోగ్యబీమా, ఇన్సూరెన్స్ పాలసీ అమలు చేయాలని కోరారు. అనంతరం సమస్యలపై వినతిపత్రాన్ని పలాస బ్రాంచ్ మేనేజర్ ఎ.తులసీ బాయికి అందజేశారు. కార్యక్రమంలో పలాస పీఏసీఎస్ ఉద్యోగులు సీఇవో శ్రీనివాసరా వు, జగదీశ్వరరావు, శ్రీను, విజయకుమార్, నందిని, బోనుబెహరా పాల్గొన్నారు.

## గంజాయిపై ఉక్కుపాదం మోపాలి: షర్మిల



**అమరావతి, పతాకం న్యూస్:** మదనపల్లెలో ఏడేళ్ల బాలికపై జరిగిన హత్యాచారం అత్యంత దారుణమని, గంజాయి మత్తులో ముక్కుపచ్చలారని పసిబిడ్డపై జరిగిన ఈ పైశాచిక ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. ఈ దారుణ ఘటన పట్ల కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నామని, బాలిక కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాలు ఏరులై పారుతున్నాయనడానికి మదనపల్లె ఘటనే నిదర్శనమని షర్మిల ఆరోపించారు. డ్రగ్స్, గంజాయిపై డేగ కన్ను పెట్టామని, ఉక్కుపాదం మోపుతామని కూటమి ప్రభుత్వం చెప్పుకోవడమంతా ఆర్భాటమేనని విమర్శించారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రభుత్వం చేస్తున్న ప్రచారమంతా తూతూ మంత్రంగానే మిగిలిపోయిందని ఆమె దుయ్యబట్టారు. ప్రభుత్వ వైఫల్యం కారణంగానే ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయని విమర్శించారు. బాధిత బాలిక కుటుంబాన్ని కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని షర్మిల డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పైశాచిక ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయంలో వ్యక్తిగతంగా దృష్టి సారించాలని, గంజాయి, డ్రగ్స్ సరఫరాపై ఉక్కుపాదం మోపడంతో పాటు నిరంతరం నిఘా వ్యవస్థను పటిష్ఠం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. మాదకద్రవ్యాల మహమ్మారి నుంచి రాష్ట్రాన్ని కాపాడటంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని షర్మిల స్పష్టం చేశారు.

## శ్రీవారి నెయ్యి టెండర్లపై..
## ఆరోపణల్లో వాస్తవం లేదు: టీటీడీ




**తిరుమల, పతాకం న్యూస్:** తిరుమల శ్రీవారి ప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యి కొనుగోలు టెండర్ల ప్రక్రియపై ఇటీవల వస్తున్న ఆరోపణలపై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) స్పందించింది. టెండర్ల కేటాయింపు అత్యంత పారదర్శకంగా జరిగిందని, ఇందులో ఎలాంటి అవకతవకలకు తావులేదని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. కొన్ని సంస్థలకు అనుకూలంగా వ్యవహరించారని, ధరలు పెంచి కట్టబెట్టారని వస్తున్న ఆరోపణలను ఆయన ఆధారాలతో సహా ఖండించారు. ప్రముఖ కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ (కేఎంఎఫ్) బ్రాండ్ అయిన 'నందిని' డైరీని తప్పించారనే ప్రచారంలో వాస్తవం లేదని టీటీడీ చైర్మన్ తెలిపారు. 2024 నుంచి ఇప్పటివరకు నిర్వహించిన మొత్తం 7 టెండర్లలో 4 టెండర్లను నందిని డైరీనే దక్కించుకుందని వివరించారు. దీని ద్వారా మొత్తం 40 లక్షల కిలోల నెయ్యి సరఫరాకు నందిని అర్హత సాధించిందని, ప్రస్తుతం టీటీడీకి అవసరమైన నెయ్యిలో 62 శాతం వాటాను ఆ సంస్థే అందిస్తోందని పేర్కొన్నారు. ఆసక్తికరంగా, 2019-24 మధ్య కాలంలో నందిని డైరీకి టీటీడీ నుంచి ఎటువంటి టెండర్లు లభించలేదనే విషయాన్ని కూడా ఆయన గుర్తుచేశారు. టెండర్లలో ధరలు పెంచి ఆర్డర్లు ఇచ్చారని, కమీషన్ల కోసమే ఇలా చేశారని వస్తున్న విమర్శలపైనా టీటీడీ వివరణ ఇచ్చింది. 2016లో లీటరు ఆవు పాల ధర రూ.17-20 ఉండగా, కిలో నెయ్యి ధర రూ.278గా ఉండేదని తెలిపారు. ప్రస్తుతం పాల సేకరణ ధర రూ.42కు (సుమారు 147 శాతం పెరుగుదల) చేరినందున, నెయ్యి మార్కెట్ ధర కూడా దానికి అనుగుణంగా రూ.658కి (సుమారు 137 శాతం పెరుగుదల) పెరిగిందన్నారు. జాతీయ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ) నిపుణుల సూచనలు, దేశవ్యాప్త హోల్‌సేల్ మార్కెట్ ధరలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే అత్యంత పారదర్శకంగా ధరలను ఖరారు చేశామని స్పష్టం చేశారు. కేవలం ఇందాపూర్ డైరీకే టెండర్లు కట్టబెట్టారన్న ఆరోపణను కూడా టీటీడీ తోసిపుచ్చింది. మొత్తం 7 టెండర్లలో ఇందాపూర్ డైరీ కేవలం 2 టెండర్లను మాత్రమే దక్కించుకుని 10 లక్షల కిలోల నెయ్యిని సరఫరా చేస్తోందని తెలిపారు. టెండర్లలో పాల్గొన్న వాటిలో నాణ్యతా ప్రమాణాల ప్రకారం అర్హత సాధించిన నందిని, మదర్ డైరీ, సంగం, ఇందాపూర్ డైరీలకు ఆర్డర్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఒక టెండర్‌లో గెలుపొందిన నందిని డైరీ, పెరిగిన ధరల కారణంగా తాము 20 లక్షల కిలోలకు బదులు 10 లక్షల కిలోల నెయ్యిని మాత్రమే సరఫరా చేయగలమని వెల్లడించిందని టీటీడీ పేర్కొంది. శ్రీవారి ప్రసాదాల తయారీకి నెయ్యి సరఫరాలో అంతరాయం కలగకుండా ఉండేందుకే, నిబంధనల ప్రకారం ఎల్2గా నిలిచిన ఇతర జాతీయ స్థాయి డైరీలకు అవకాశం కల్పించాల్సి వచ్చిందని వివరించారు. టెండర్ దక్కించుకున్న అన్ని కంపెనీలు ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ, ఎన్ డీడీబీ నిబంధనలను కచ్చితంగా పాటిస్తున్నాయని, శ్రీవారి ప్రసాదాల నాణ్యత, పవిత్రతను కాపాడటానికి టీటీడీ బోర్డు కట్టుబడి ఉందని చైర్మన్ బీఆర్ నాయుడు పునరుద్ఘాటించారు.

## హైదరాబాద్‌లో అక్రమంగా నివసిస్తున్న 23 మంది విదేశీయుల అరెస్ట్



**హైదరాబాద్, పతాకం న్యూస్:** హైదరాబాద్ నగరంలో అక్రమంగా నివసిస్తున్న విదేశీయులపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. గోల్కొండ జోన్ పరిధిలోని టోలిచౌకి పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి భారీ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి, వీసా గడువు ముగిసినా దేశంలోనే ఉంటున్న 23 మంది విదేశీయులను అదుపులోకి తీసుకున్నారు. గోల్కొండ జోన్ డీసీపీ జి. చంద్రమోహన్ ప్రత్యక్ష పర్యవేక్షణలో సుమారు 250 మంది పోలీసు సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. పారామౌంట్ కాలనీ (గేట్లు 1 నుంచి 4), ఐఏఎస్ కాలనీ, హకీంపేట్ కుంట ప్రాంతాల్లో పక్కా సమాచారంతో పోలీసులు ఏకకాలంలో సోదాలు చేపట్టారు. ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్ఆర్ఆర్ఓ) అధికారుల సహాయంతో ఈ సోదాలు జరిగాయి. వివిధ దేశాలకు చెందిన 23 మంది అక్రమంగా నివసిస్తున్నట్లు గుర్తించారు. వీరి వీసా, పాస్‌పోర్ట్ గడువు ముగిసినట్లు తేలింది.

## ఏప్రిల్‌లో తమిళనాడు, బెంగాల్, కేరళ అసెంబ్లీ ఎన్నికలు!




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** తమిళనాడు, బంగాల్, కేరళ, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్‌లో వివిధ తేదీల్లో జరగనున్నట్లు తెలిసింది. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం మార్చి రెండు లేదా మూడో వారంలో నోటిఫికేషన్ ఇవ్వనుందని అధికారిక వర్గాలు తెలిపాయి. అయితే, తమిళనాడు, అసోం, కేరళ, బంగాల్ అసెంబ్లీ గడువు మే నెలలో ముగియనుంది. అదేవిధంగా, పుదుచ్చేరి అసెంబ్లీ గడువు కూడా జూన్ 15 నాటికి ముగియనుంది. ఈ నేపథ్యంలో ఈసీ అధికారులు ఇప్పటికే ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో పర్యటిస్తూ ఏర్పాట్లపై సమీక్షలు నిర్వహిస్తున్నారు. కాగా, 2021లో బంగాల్‌లో ఎనిమిది విడతల్లో పోలింగ్ నిర్వహించారు. అసోంలో రెండు, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరిలో ఒకే విడతలో ఈసీ ఎన్నికలు నిర్వహించింది. మరోవైపు, ఆయా రాష్ట్రాల్లో ఈసీ నిర్వహిస్తున్న సర్ ప్రక్రియ ముగింపు దశకు చేరుకుంది. పుదుచ్చేరిలో ఓటర్ల తుది జాబితాను ఇప్పటికే ప్రచురించారు.

# చిత్తూరు జిల్లాకు వరంగా మారిన 'చిత్తూరు- తచ్చూరు ఎక్స్‌ప్రెస్ హైవే'



**చిత్తూరు, పతాకం న్యూస్:** చిత్తూరు- తచ్చూరు 6 లేన్ ఎక్స్‌ప్రెస్ హైవే పనుల్ని 2022 అక్టోబరులో రూ.4 వేల కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించారు. చిత్తూరు సమీపంలోని మాపాక్షి వద్ద ప్రారంభమవుతుంది. ఈ పనులను నాలుగు ప్యాకేజీలుగా పూర్తి చేశారు. మొదటి ప్యాకేజీ ఏపీలో 38.8 కి.మీ, తమిళనాడులో 5 కి.మీ పొడవు ఉండగా, దీని అంచనా విలువ రూ.1,484 కోట్లు. రెండోది ఏపీలో 5.88 కి.మీలు, తమిళనాడులో 11.70 కి.మీలు ప్రయాణిస్తుండగా, దీని అంచనా విలువ రూ.591.99 కోట్లు. మూడోది ఏపీలో 30.32 కి.మీలు, తమిళనాడులో 4.34 కి.మీలు పొడవున ఉండగా, దీని విలువ రూ.1,102.63 కోట్లు. నాలుగోది 20 కి.మీలూ తమిళనాడులోనే ప్రయాణించగా, దీని విలువ రూ.818.73 కోట్లు. చిత్తూరు- తచ్చూరు హైవే చిత్తూరు జిల్లాలో 62.3 కిలోమీటర్లు, తిరుపతి జిల్లాలో 12.7 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. మిగిలింది తమిళనాడులో ఉంటుంది. ఈ హైవే ప్రయాణించే ప్రాంతాలు పారిశ్రామికంగా, ఐటీ పరంగా అభివృద్ధి చెందడానికి అవకాశముంది. తమిళనాడులోని ఎన్నూరు పోర్టుకు అనుసంధానం చేస్తుండడంతో వాణిజ్యపరంగా ఎగుమతి, దిగుమతులకు అనుకూలంగా ఉంటుంది. చిత్తూరు 3.4 కి.మీ వద్ద, గంగాధరనెల్లూరు 12.4 కి.మీల వద్ద, శ్రీరంగరాజపురం 32 కి.మీల వద్ద, నగరి 60 కి.మీల వద్ద ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ఉంటాయి. ఈ ప్రాంతాల్లో మాత్రమే వాహనాల్ని హైవే మీదకు అనుమతిస్తారు. మిగిలిన ప్రాంతాల్లో ఎక్కడా వాహనాలు వచ్చి వెళ్లే అవకాశం ఉండదు.

చిత్తూరు- తచ్చూరు ఎక్స్‌ప్రెస్ హైవే పనులు పూర్తవ్వగా.. చిత్తూరు జిల్లా మీదుగా వెళుతున్న బెంగళూరు- చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే పనులు కూడా జోరుగా జరుగుతున్నాయి. బెంగళూరు- వి.కోట మధ్య ఇప్పటికే రాకపోకల్ని సాగిస్తున్నారు. వి.కోట నుంచి బంగారుపాళ్యం వరకు 90శాతానికిపైగా పనులు పూర్తయ్యాయి. ఫారెస్టు అనుమతుల కారణంగా మొగిలి ఘాట్ వద్ద మాత్రమే పనులు పెండింగులో ఉన్నాయి. దీన్ని కూడా ఈ ఏడాది సెప్టెంబరులో పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇది మొత్తం పొడవు 267 కి.మీలు ఉండగా.. కర్ణాటకలోని బేతమంగళం వద్ద ప్రారంభమై బైరెడ్డిపల్లె, బంగారుపాళ్యం, గుడిపాల వరకు జిల్లాలో 85 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. జిల్లాలో ప్రాజెక్టు అంచనా విలువ రూ.4,925కోట్లు. ఈ పనులను మూడు ప్యాకేజీలుగా విభజించారు. దీనికి జిల్లాలోని బైరెడ్డిపల్లె మండలం కమ్మనపల్లె వద్ద, బంగారుపాళ్యం మండలం మొగిలి వద్ద, గుడిపాల మండలం రామాపురం వద్ద ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ఉన్నాయి.

# త్వరలో ఎన్టీఆర్ విద్యాలక్ష్మి, ఎన్టీఆర్ కల్యాణలక్ష్మి పథకాలు

**అమరావతి, పతాకం న్యూస్:** మహిళా దినోత్సవాన్ని (మార్చి 8) పురస్కరించుకొని డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం తీపికబురు అందించనుంది. గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ (సెర్ప్) ఏర్పాటై 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందులో డ్వాక్రా మహిళలకు వెన్నుదన్నుగా నిలిచే రెండు కీలక పథకాలతో పాటు మరిన్ని వరాలను ప్రకటించనున్నారు. వీటికి ఇప్పటికే ఆయన ఆమోదముద్ర వేశారు. డ్వాక్రా మహిళల కుటుంబాల్లో చదువుకు, వివాహాలకు చేయూతనిచ్చేలా "ఎన్టీఆర్ విద్యాలక్ష్మి", "ఎన్టీఆర్ కల్యాణలక్ష్మి" పథకాలను సెర్ప్ అధికారులు రూపొందించారు. ఈ పథకాల కింద స్త్రీ నిధి బ్యాంకు (సెర్ప్ పరిధి) ద్వారా గరిష్ఠంగా రూ.లక్ష వరకు పావలా వడ్డీకి రుణం అందిస్తారు. ఇందుకు సంబంధించి విధివిధానాలు ఖరారు చేశారు. గతేడాది అక్టోబరులోనే వీటిని అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించినా సీఎం ఆదేశాల మేరకు పథకాల అమలులో లోపాలకు ఆస్కారం లేకుండా ఉండేందుకు అధికారులు మరిన్ని జాగ్రత్తలు తీసుకున్నారు.

తాజాగా మహిళా దినోత్సవం సందర్భంగా సీఎం చేతుల మీదుగా ఈ పథకాలను ఆవిష్కరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. డ్వాక్రా సంఘంలో నమోదై కనీసం ఆరు నెలలు, అంతకంటే ఎక్కువ కాలం ఉన్న సభ్యులకు ఈ పథకాలు వర్తింపజేయనున్నారు. ఇప్పటికే బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి, ఇతర మార్గాల్లో తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించే వారికి చేయూత అందజేస్తారు. లబ్ధిదారు బయోమెట్రిక్ నమోదు ఆధారంగా పథకాలు అమలు చేస్తారు.

**ఎన్టీఆర్ విద్యాలక్ష్మి పథకం:** పాఠశాలలు, కళాశాలల్లో పిల్లలకు చెల్లించాల్సిన ఫీజుకు అనుగుణంగా అవసరమైన మొత్తాన్ని తీసుకోవచ్చు. గరిష్ఠంగా ఇద్దరు పిల్లల చదువుకు రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు రుణసాయం 4% వడ్డీ (పావలా వడ్డీ)కి ఇస్తారు. తీసుకున్న మొత్తానికి అనుగుణంగా చెల్లింపు వాయిదాల సంఖ్య ఉంటుంది. గరిష్ఠంగా 48 వాయిదాల్లో చెల్లించాలి. అడ్మిషన్ లెటర్, ఫీజు చెల్లింపు విధానం, ఇనిస్టిట్యూట్ వివరాలు, రసీదులు సమర్పించాలి. దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లో సభ్యురాలి బ్యాంకు ఖాతాలో నేరుగా నగదు జమ చేస్తారు.

**ఎన్టీఆర్ కల్యాణ లక్ష్మి:** సభ్యురాలి కుమార్తె వివాహానికి ఈ పథకం వర్తిస్తుంది. అవసరానికి అనుగుణంగా రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు (గరిష్ఠంగా) రుణంగా తీసుకునే వెసులుబాటు ఉంది. 4% వడ్డీ (పావలా వడ్డీ)కి ఇస్తారు. తీసుకున్న మొత్తానికి అనుగుణంగా చెల్లింపు వాయిదాల సంఖ్య ఉంటుంది. గరిష్ఠంగా 48 వాయిదాల్లో



చెల్లించాలి. లగ్నపత్రిక, శుభకార్యం నిర్వహణకు సంబంధించిన పత్రం, పెళ్లి ఖర్చు అంచనా సమర్పించాలి. పరిశీలన అనంతరం నేరుగా సభ్యురాలి బ్యాంకు ఖాతాలో నగదు జమ చేస్తారు.

ఒక్కో పథకానికి ఏడాదికి రూ.1,000 కోట్ల చొప్పున రెండింటికి కలిపి రూ.2 వేల కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ పథకాల అమలు ద్వారా పావలా వడ్డీ కింద సమకూరే ఆదాయంలో 50 శాతాన్ని తిరిగి డ్వాక్రా సంఘాలకు అనుబంధంగా ఉన్న మండల సమాఖ్యలు, గ్రామ సమాఖ్యల బలోపేతానికి వినియోగించనున్నారు. మిగతా 50 శాతం స్త్రీ నిధి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల ప్రయోజనాలకు ఉపయోగించనున్నారు. ఈ పథకం కింద రుణసాయం పొందిన తర్వాత సదరు లబ్ధిదారు ప్రమాదంలో చనిపోతే ఆ రుణ మొత్తాన్ని మాఫీ చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 27,500 మంది యానిమేటర్లు, 5 వేల మంది కమ్యూనిటీ కోఆర్డినేటర్లు విధులు నిర్వర్తిస్తుండగా, వీరికి రూ.15 వేలు విలువ చేసే సెల్‌ఫోన్లు ఉచితంగా ఇవ్వనున్నారు. 600 మంది ఏపీఎంలకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తారు. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వంలో వీరికి సెల్‌ఫోన్లు ఇవ్వగా చాలా వరకు అవి పాడైపోయాయి.

## అన్ని జోన్లలో పర్యటిస్తా.. రోడ్లు శుభ్రంగా లేకపోతే సస్పెండ్ చేస్తా .. రేవంత్‌రెడ్డి వార్నింగ్

**హైదరాబాద్, పతాకం న్యూస్:** పురపాలక శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు, కమిషనర్లు, సిబ్బందిపై సీఎం సీరియస్ అయ్యారు. త్వరలోనే ప్రతి జోన్‌లో వ్యక్తిగతంగా పర్యటించి పరిస్థితులను పరిశీలిస్తానని స్పష్టం చేశారు. రోడ్లు శుభ్రంగా లేకపోతే అక్కడికక్కడే అధికారులపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. కమిషనర్లు, జోనల్ కమిషనర్లు ఉదయం నుంచే ఫీల్డ్‌లో ఉండాలని, రోజూ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. చాలా మంది అధికారులు ఫీల్డ్‌లోకి వెళ్లడం లేదని, అలాంటి వారిని సస్పెండ్ చేస్తానని ముఖ్యమంత్రి వార్నింగ్ ఇచ్చారు. హైదరాబాద్‌తో పాటు మూడు కార్పొరేషన్లలో శానిటేషన్, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన మేయర్లు, డిప్యూటీ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నగరంలో స్మార్ట్ పోల్స్ ఏర్పాటు పైన అధ్యయనం చేయాలన్నారు సీఎం. ట్రాఫిక్ బాగా ఉన్న చోట పీపీపీ విధానంలో స్కై వాక్ బ్రిడ్జిల



ఏర్పాటుపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో మల్టీలెవల్ కార్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అడ్వటైజింగ్ బోర్డుల ఏర్పాటుపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండి పడకుండా చర్యలు ఉండాలని సీఎం తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల కోసం 10 శాతం అడ్వటైజింగ్ బోర్డులు కేటాయించాలని ముఖ్యమంత్రి చెప్పారు. అడ్వటైజింగ్ బోర్డుల నుంచి సంవత్సరానికి ఒక సారి ఫీజు వసూలు చేయాలని అధికారులకు సూచించారు.

## ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక



**మాచర్ల, పతాకం న్యూస్:** మండలంలో రూ.11 కోట్లు 70 లక్షలు 13 వేల 296 విలువైన ఉపాధి హామీ పనులు నిర్వహించినట్లు ద్వామా పీడీ సిద్ధలింగమూర్తి తెలిపారు. ఉపాధి హామీ పనులపై స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో 18వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మండలంలోని 16 గ్రామపంచాయితీల పరిధిలో మొత్తం 719 పనులు చేపట్టగా వేతనాల రూపంలో రూ.8 కోట్లు 94 లక్షలు 28 వేల 777 ఖర్చు కాగా, పంచాయతీరాజ్ శాఖ మెటీరియల్ కాంపోనెంట్‌గా రూ.2 కోట్లు 75 లక్షలు 84 వేల 519 చెల్లించినట్లు వివరించారు. 2024-2025 సంవత్సరానికి సంబంధించిన పనుల్లో రూ.కోటి 35 లక్షల పనులకు సామాజిక తనిఖీలు ప్రారంభమైన నాటికి సరైన వివరాలు అందలేదని తెలిపారు. 20 రోజులపాటు నిర్వహించిన గ్రామసభల్లో తగిన ఆధారాలు లభించినట్లు చెప్పారు. గతంలో విధులు మానేసిన ఫీల్డ్ అసిస్టెంట్లు సరైన రికార్డులు అందించకపోవడంతో ఈ సమస్య తలెత్తిందన్నారు. మరో రూ.కోటి 29 లక్షల 520 విలువైన పనులకు సంబంధించిన ఫొటోలు, ఆధారాలు సక్రమంగా లేవని చెప్పారు. అయితే పనులు జరిగాయని, వేతనాలు చెల్లించామని స్పష్టం చేశారు. రెక్టిఫికేషన్ కోసం అధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు. తగిన పత్రాలు, ఫొటోలు సమర్పిస్తే ఆ మొత్తాన్ని కూడా ఆమోదించనున్నట్లు చెప్పారు. మొత్తం పనుల్లో రూ.14 వేల పెనాల్టీ విధించామని, రూ.72,064 రికవరీ కోసం ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఫణికుమార్, ఏపిడి జి.వి. సత్యనారాయణ, ఏపీవో నాగశ్రీనివాస్, ఎఫ్ఎలు పాల్గొన్నారు.

## వేసవిలో నీటిఎద్దడి లేకుండా చర్యలు

**గుంటూరు, పతాకం న్యూస్:** జిల్లాలో ఎక్కడా వేసవి నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా నీరు, పారిశుధ్య కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వేసవి నీటి ఎద్దడి లేకుండా పూర్తి స్థాయిలో స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. గ్రామ పంచాయతీ వారీగా నిధుల లభ్యత నివేదించాలన్నారు. గతేడాది, అంతకంటే ముందు సంవత్సరాలలో జిల్లాలో ఏ మండలాలు, గ్రామాల్లో తాగు నీటి సమస్య వచ్చిందో పరిశీలించి ప్రస్తుతం ఉన్న పరిస్థితిని గమనించాలని, నీటి ఎద్దడి గ్రామాలకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని సూచించారు. బోరు బావులు మరమ్మతులు 24 గంటల్లో పూర్తి చేయటానికి అవసరమైన విడిభాగాలు సిద్ధంగా ఉంచాలన్నారు.

## అసైన్డ్ భూముల రైతుల నిరసన




**పల్నాడు, పతాకం న్యూస్:** అచ్చంపేట మండలంలోని చెరుకుంపాలెం గ్రామ అసైన్డ్ భూముల రైతుల నిరసన మండల కేంద్రమైన అచ్చంపేటలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద కూడా కొనసాగింది. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె.గోపికృష్ణారెడ్డి మాట్లాడుతూ చెరుకుంపాలెం గ్రామం తాళ్లచెరువు రెవెన్యూ పరిధిలోని 320, 321 సర్వే నంబర్‌లో ఇచ్చిన డీకే పట్టాలు గురించి అటవీ అధికారుల వేధింపులు గురిచేస్తున్నారని, సాగుకు అడ్డుపడుతున్నారని, దీనిపై కలెక్టర్, ఆర్‌డిఒ, తహశీల్దార్ కార్యాలయాల్లో పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రైతులతో తహశీల్దార్ సిహెచ్ శ్రీనివాసరావు మాట్లాడారు. తమ వద్దనున్న ఉన్న ఆధారాలకు, అటవీ అధికారులు రికార్డులకు పొంతల లేవని, జిల్లా ఏడీ కార్యాలయానికి నివేదించి శుక్రవారంలోగా సమస్యకు పరిష్కార మార్గం చూపిస్తామని చెప్పారు. దీనిపై ఆర్‌డిఒతోనూ మాట్లాడతామన్నారు. నిరసనలో కత్తుల నాగసంధ్య, సుంకర లాలమ్మ, కొంపెర్ల మరియమ్మ, సుంకర భానురావు, సుంకర స్వామి, రైతుసంఘం మండల కార్యదర్శి ఆర్.వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

## చంద్రబాబు పర్యటన ఏర్పాట్లపై పరిశీలన



**వినుకొండ, పతాకం న్యూస్:** స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా సిఎం చంద్రబాబు ఈనెల 21వ తేదీన వినుకొండకు రానున్న సందర్భంగా పట్టణంలో పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల పర్యటించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో హెలిపాడ్ స్థలాన్ని పరిశీలించారు. నరసరావుపేట రోడ్డులోని ఎన్ఎస్‌పి స్థలాన్ని పరిశీలించి, సిఎం ప్రజా వేదిక, కార్యకర్తల సమావేశానికి అవసరమైన వేదిక ఏర్పాటుకు జిల్లా అధికారులతో చర్చించారు. ఎన్ఎస్‌పి స్థలాన్ని బాగుచేయించి, సిఎం నిర్వహించే రెండు వేదికల ఏర్పాటుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. ఆర్‌డిఒ మధులత, డిఎం అండ్ హెచ్ఒ రవి, డిసిహెచ్ఎస్ ప్రసూన, డీఎస్పీ హనుమంతరావు పాల్గొన్నారు.

## ధవలేశ్వరం బ్యారేజ్ గేట్లకు రూ.150 కోట్ల నిధులు: మంత్రి నిమ్మల



**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కీలక ప్రకటన చేశారు. నాడు బ్యారేజ్‌కు నిధులు ఇచ్చిన చంద్రబాబే.. మళ్లీ నేడు ధవలేశ్వరం బ్యారేజ్ కొత్త గేట్ల ఏర్పాటుకు రూ.150 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా పాడైపోయిన గేట్లను తొలగించి కొత్త గేట్లను అమర్చనున్నట్టు వెల్లడించారు. బ్యారేజ్‌లోని 117 గేట్లను తొలగించి వాటి స్థానంలో అధునాతనమైన కొత్త గేట్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ పనుల ద్వారా గోదావరి జలాలు సమర్థవంతంగా నిల్వ ఉండి, డెల్టా ప్రాంత రైతులకు సాగునీటి సమస్యలు తగ్గుతాయని ఆయన తెలిపారు. ఈ సీజన్‌లోనే అన్ని పనులు పూర్తి చేసి, కొత్త గేట్లను పూర్తి స్థాయిలో అమర్చనున్నట్లు మంత్రి రామానాయుడు ప్రకటించారు. టెండర్లు, ఇతర చర్యలు వేగంగా పూర్తి చేసి త్వరితగతంగానే కొత్త గేట్లను ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గతంలో 2014-19లో ధవలేశ్వరం గేట్లు ప్రమాదకరంగా ఉన్నాయని.. టీడీపీ ప్రభుత్వంలో 58 కొత్త గేట్లు ఏర్పాటు చేసినట్లు మంత్రి గుర్తుచేశారు. తిరిగి ఇప్పుడు మిగిలిన 117 గేట్లను కూడా కొత్తవి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 2019-24 మధ్య కాలంలో ధవలేశ్వరం గేట్లు ప్రమాదకరంగా ఉన్నాయని సీడబ్ల్యూసీ హెచ్చరించినప్పటికీ గత ప్రభుత్వం పట్టించుకోలేదని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు.

## విద్యుత్ వినియోగంలో అక్రమాలపై రూ.4.14 అపరాధ రుసుం

**ప్రతిపాడు, పతాకం న్యూస్:** విద్యుత్ విజిలెన్స్, ఆపరేషన్ విభాగాలు సిఆర్‌డిఎ పర్యవేక్షక ఇంజినీర్ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్తిపాడు సెక్షన్, జి.పి.వి.పాలెం, గనికపూడి, కె.జి.పాలెం, కొండెపాడు, మేడవారిపాలెం, ఎన్.ఎన్.వి.పాలెం, తిమ్మాపురం, తుమ్మలపాలెం, ఎన్.జి.వి.పాలెం, వగీపురం, యనమదల గ్రామాల్లో తనిఖీలు చేపట్టాయి. లోపాలను గుర్తించి మొత్తం రూ.4.14 లక్షల అపరాధ రుసుం విధించినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్ఎ కరీం, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.ఏడుకొండలు తెలిపారు. 29 మంది అధికారులు, 87 మంది సిబ్బంది 29 బృందాలుగా ఏర్పడి 1545 సర్వీసులను తనిఖీ చేశారు. మీటరు లేకుండా నేరుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న నలుగురికి రూ.0.02 లక్షలు, మీటరున్నా అక్రమంగా వాడుతున్న ఐదుగురికి రూ.1.10 లక్షలు, అనుమతించిన కేటగిరీ కాక ఇతర కేటగిరీలలో వాడుతున్న ఇద్దరికి రూ.0.35 లక్షలు, అదనంగా లోడ్ వాడుతున్న 61 మందికి రూ.2.67 లక్షల జరిమానా విధించారు.

# వయస్సును బట్టి ఎవరికి ఎన్ని గంటల నిద్ర అవసరం..?



వయస్సును బట్టి ఎవరికి ఎన్ని గంటల నిద్ర అవసరం..? నిపుణులు ఏం చెబుతున్నారు..? మన శరీరానికి నిద్ర చాలా అవసరం. ఆహారం, నీరు, గాలి ఎంత అవసరమో మన శరీరానికి నిద్ర కూడా అంతే అవసరం. నిద్రించడం వల్ల మన శరీరానికి విశ్రాంతి లభించడంతో పాటు మన ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు కలుగుతుంది. మన శరీరానికి నిద్ర చాలా అవసరం. ఆహారం, నీరు, గాలి ఎంత అవసరమో మన శరీరానికి నిద్ర కూడా అంతే అవసరం. నిద్రించడం వల్ల మన శరీరానికి విశ్రాంతి లభించడంతో పాటు మన ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు కలుగుతుంది. నిద్రించడం వల్ల శరీర రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇన్ఫెక్షన్ లు, అనారోగ్య సమస్యలు మన దరి చేరకుండా ఉంటాయి. తగినంత నిద్రించడం వల్ల శరీర బరువు అదుపులో ఉంటుంది. ఆకలి, కడుపు నిండిన భావన కలిగించే హార్మోన్ ను నిద్ర ప్రభావితం చేస్తుంది. కనుక తగినంత నిద్రించడం వల్ల మనం ఆరోగ్యకరమైన బరువును నిర్వహించవచ్చు. అలాగే నిద్ర భావోద్వేగాలను నియంత్రిస్తుంది. ఒత్తిడి హార్మోన్లను తగ్గిస్తుంది. మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది. రక్తపోటును అదుపులో ఉంచడంలో, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో, గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో నిద్ర పాత్ర ఎంతో ఉంది.

రోజూ తగినంత నిద్రించడం వల్ల దీర్ఘ కాలిక అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం చాలా తక్కువగా ఉంటుంది. తగినంత నిద్రించడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. నిద్ర మెదడు ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది. నిద్రించడం వల్ల అభిజ్ఞా పనితీరు మెరుగుపడుతుంది. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయి. ఈ విధంగా నిద్ర వల్ల మనం ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను సొంతం చేసుకోవచ్చు. అలాగే మన వయసును బట్టి మనం నిద్రించే సమయం మారుతుంది. సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ వారి ప్రకారం నిద్రించే సమయం వయసును బట్టి గణనీయంగా మారుతూ ఉంటుంది. మన వయసును బట్టి మనం ఎన్ని గంటలు నిద్రించాలో ఇప్పుడు తెలుసుకుందాం.

నవజాత శిశువులు (0-3 నెలలు) రోజుకు 14-17 గంటలు నిద్రించాలి. అలాగే శిశువులు (4-12 నెలలు) 12-16 గంటలు, పసిబిడ్డలు (1-2 సంవత్సరాలు) 11-14 గంటలు, ప్రీస్కూలర్లు (3-5 సంవత్సరాలు) 10-13 గంటలు, స్కూలు వయస్సు పిల్లలు (6-12 సంవత్సరాలు) 9-12 గంటలు, టీనేజర్లు (13-17 సంవత్సరాలు) 8-10 గంటలు, పెద్దలు (18-60 సంవత్సరాలు) 7 గంటలు లేదా అంతకంటే ఎక్కువ గంటలు, వృద్ధులు (61-64 సంవత్సరాలు) 7-9 గంటలు, 65 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న పెద్దలు 7-8 గంటలు నిద్రించాలి. ఇలా మన వయసును బట్టి మనం నిద్రించే సమయం మారుతుందని వైద్యులు చెబుతున్నారు.

ఇక శరీర అవసరాలను బట్టి కూడా మనం విశ్రాంతి తీసుకునే సమయం మారుతూ ఉంటుంది. నిద్రలేమితో బాధపడే వారి శరీరం కోలుకోవడానికి ఎక్కువగా నిద్రించాల్సి ఉంటుంది. గర్భధారణ సమయంలో హార్మోన్ల మార్పుల కారణంగా నిద్ర నాణ్యత తగ్గుతుంది. కనుక గర్భిణీ స్త్రీలు కూడా ఎక్కువగా విశ్రాంతి తీసుకోవాలి.

వృద్ధాప్యంలో ఉన్న వారు రాత్రి సమయంలో ఎక్కువగా మేల్కొంటారు. కనుక వారికి కూడా నిద్ర ఎక్కువగా అవసరమవుతుంది.ఈవిధంగా మన వయసు, మన శరీర అవరాలు మనం నిద్రించే సమయాన్ని ప్రభ్యావితం చేస్తాయని, మన వయసుకు తగినంత సమయం పాటు మనం నిద్రించినప్పుడే మనం ఆరోగ్యంగా జీవించగలుగుతామని వైద్యులు సూచిస్తున్నారు.

# గృహ నిర్మాణానికి కేటాయింపుల్లో 68% కోత!



**అమరావతి, పతాకం న్యూస్:** పేదల ఇళ్ల నిర్మాణానికి నిధుల కేటాయింపులో ప్రభుత్వం వెనుకడుగు వేసింది. పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని చెబుతూనే, మరోపక్క ఇందుకు అవసరమైన నిధుల కేటాయింపుల్లో మాత్రం తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని బడ్జెట్ ప్రతిపాదనలు పరిశీలిస్తే స్పష్టమవుతుంది. తాజాగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం గృహ నిర్మాణానికి కేటాయించిన నిధులు పెంపు లేకపోవడం, గత బడ్జెట్‌లో కేటాయింపులను సవరించి 68.07 శాతం వరకూ తగ్గించడం వంటి అంశాలను పరిశీలిస్తే ప్రభుత్వం తీరుకు అద్దం పడుతుంది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2025-26 బలహీన వర్గాల గృహ నిర్మాణ పథకాలకు రూ.6,317.77 కోట్లను కూటమి ప్రభుత్వం కేటాయించినప్పటికీ రూ.2017.41 కోట్లకు సవరించింది. వచ్చే ఏడాది (2026-27) బడ్జెట్‌లో ఇందుకు రూ.6,357.30 కోట్లు కేటాయించడం గమనార్హం. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం వాస్తవంగా ఖర్చు చేసిన మొత్తం రూ.1,550.74 కోట్లు మాత్రమే ఉంది. ఈ ఏడాది మార్చి నాటికి 5 లక్షల ఇళ్లలో గృహ ప్రవేశాలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ఇటీవల ప్రకటించారు. వచ్చే మూడేళ్లలో 17 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి అందరికీ ఇళ్లు అందజేస్తామన్న ముఖ్యమంత్రి ప్రకటనలకు తగ్గట్టుగా బడ్జెట్‌లో కేటాయింపులు కనిపించడం లేదు. గృహ నిర్మాణంలో వివిధ పథకాలకు గతంలో ఖర్చు చేసిన మొత్తం కంటే ప్రస్తుతం బడ్జెట్ (2025-26) సవరించిన అంచనాల్లో తగ్గించారు. పిఎంజిఎవై (అర్బన్ 2.0)కు గత బడ్జెట్‌లో కేటాయింపులు చేయకపోగా, సవరించిన అంచనాల్లో కేవలం రూ.23.52 కోట్లుగా పేర్కొన్నారు. వచ్చే ఏడాది బడ్జెట్ (2026-27)లో ఈ పథకానికి రూ.575.47 కోట్లుగా కేటాయించారు. పిఎంఎవై (అర్బన్ బిఎల్‌సి)కి గతేడాది బడ్జెట్‌లో రూ.4,637.23 కోట్లుగా ఘనంగా చూపించినా, దానిని ప్రస్తుతం సవరించి రూ.517 కోట్లకు తగ్గించారు. పిఎంఎవై (గ్రామీణ్) పథకానికి 2024-25లో వాస్తవంగా పెట్టిన ఖర్చు రూ.361 కోట్లుగా ఉండగా, 2025-26 బడ్జెట్‌లో రూ.602.30 కోట్లు కేటాయించి, ప్రస్తుతం సవరించి రూ.210.55 కోట్లకు తగ్గించారు. పిఎం జన్‌మాన్‌కు 2024-25లో వాస్తవంగా చేసిన ఖర్చు రూ.28.32 కోట్లు మాత్రమే. 2025-26లో ఇందుకోసం రూ.225 కోట్లు కేటాయించగా, ప్రస్తుతం సవరించి రూ.335.97 కోట్లకు పెంచారు. ఈ బడ్జెట్‌లో రూ.685.70 కోట్లు కేటాయించారు. వీకర్ సెక్షన్ హౌసింగ్ పథకానికి 2024-25 ఏడాది వాస్తవ ఖర్చు రూ.260.56 కోట్లుగా ఉండగా, 2025-26 బడ్జెట్‌లో రూ.326.63 కోట్లు కేటాయించారు. సవరించిన అంచనాల్లో ఇంతే మొత్తం దక్కింది. ప్రస్తుత బడ్జెట్‌లో ఈ పథకానికి కోత వేసి రూ.287.76 కోట్లు మాత్రమే కేటాయించారు. పిఎంఎవై అర్బన్ ఇళ్ల జియో ట్యాగింగ్‌కు రూ.4.94 కోట్లు కేటాయించగా, గృహ నిర్మాణ కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు 2025-26లో కేటాయింపులు లేకపోగా, సవరించిన అంచనాల్లో రూ.87 కోట్లు చూపించారు. ప్రస్తుత బడ్జెట్‌లో ఇందుకు రూ.300 కోట్లు కేటాయించారు. గృహ నిర్మాణ సంస్థ రుణాలు 2025-26లో రూ.509.42 కోట్లుగా ఉండగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.491.22 కోట్లుగా ప్రతిపాదించారు.

# అమెరికా-ఇరాన్ అణు చర్చలు ప్రారంభం



**జెనీవా :** అమెరికా, ఇరాన్ మధ్య స్విట్జర్లాండ్ రాజధాని జెనీవాలో రెండో విడత అణు చర్చలు ప్రారంభమయ్యాయి. నగరంలోని ఒమానీ మ్యూజియంలో ఈ చర్చలు జరుగుతున్నాయి. ఇరాన్ అణు కార్యక్రమంపై నెలకొన్న వివాదాన్ని పరిష్కరించే దిశగా చర్చలు సాగుతున్నాయి. ఇరాన్ ఒప్పందాన్ని కోరుకుంటోందని ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విలేకరులకు చెప్పారు. తమ అణు కార్యక్రమంపై అమెరికా వైఖరి వాస్తవాలకు దగ్గరగా ఉన్నదని ఇరాన్ విదేశాంగ శాఖ వ్యాఖ్యానించింది. ఒమన్ మధ్యవర్తిత్వంతో జరుగుతున్న ఈ చర్చలు తమ అణు కార్యక్రమం పైన, అమెరికా విధించిన ఆంక్షల ఎత్తివేత పైన దృష్టి సారిస్తాయని తెలిపింది. ఇరాన్ క్షిపణి అభివృద్ధి కార్యక్రమంపై కూడా చర్చించాల్సి ఉన్నదని అమెరికా గతంలో తెలిపింది. ఇరాన్‌తో జరుగుతున్న చర్చలు చాలా ముఖ్యమైనవని ట్రంప్ తెలిపారు. వీటిలో తాను పరోక్షంగా భాగస్వామిని అవుతానని చెప్పారు. అణు కార్యక్రమంపై కఠిన వైఖరితో ఉంటే ఏం జరుగుతుందో ఇరాన్‌కు బాగా తెలుసునని వ్యాఖ్యానించారు. కాగా సైనిక చర్యపై ట్రంప్ బెదిరింపులను ఇరాన్ సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ మంగళవారం ప్రస్తావిస్తూ 'అమెరికా మోహరించిన యుద్ధ విమాన వాహక నౌక కంటే మేము సముద్ర గర్భంలోకి పంపే ఆయుధమే శక్తివంతమైనది' అని వ్యాఖ్యానించారు. ప్రపంచంలో అమెరికా సైన్యం శక్తివంతమైనదని ట్రంప్ చెబుతున్నారని, అయితే అలాంటి శక్తివంతమైన సైన్యానికి కొన్నిసార్లు కోలుకోలేని ఎదురు దెబ్బలు తగులుతాయని చురకలు అంటించారు. అమెరికా-ఇరాన్ మధ్య జరుగుతున్న చర్చల ఫలితాన్ని ట్రంప్ ఎలా నిర్ణయిస్తారని ప్రశ్నించారు. అలా చేయడం తప్పని, మూర్ఖత్వమని ఖమేనీ విమర్శించారు.




# ప్రపంచ రికార్డు సృష్టించిన యువరాజ్..




తాజాగా టీ20 ప్రపంచ కప్-2026లో మరోసారి యువరాజ్ పేరు వినిపించింది. అయితే ఈ పేరు భారత స్టార్ యువరాజ్ సింగ్ కాదు.. కెనడా క్రికెటర్, భారత మూలాలు ఉన్న యువరాజ్ సమ్రా. ఇతడు తాజాగా సరికొత్త చరిత్ర సృష్టించాడు. టీ20 ప్రపంచకప్ టోర్నీలో సెంచరీ బాదిన అతి పిన్న వయస్కుడిగా ప్రపంచ రికార్డు సాధించాడు. ఆ వివరాలు ఏమిటో ఇప్పుడు చూద్దాం.. టీ20 ప్రపంచ కప్-2026లో భాగంగా నిన్న(మంగళవారం) చెన్నై వేదికగా న్యూజిలాండ్, కెనడా జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కెనడా తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ క్రమంలో కెనడా ఓపెనర్ యువరాజ్ సమ్రా ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 19 ఏళ్ల ఈ ఎడమ చేతి వాటం బ్యాటర్ కేవలం 58 బంతుల్లోనే సెంచరీ చేశాడు. మొత్తంగా 65 బంతులు ఎదుర్కొన్న యువరాజ్ సమ్రా 110 పరుగులు సాధించాడు. ఇందులో 11 ఫోర్లు, ఆరు సిక్సర్లు ఉన్నాయి. తద్వారా టీ20 ప్రపంచకప్ చరిత్రలో తక్కువ బంతుల్లోనే సెంచరీ బాదిన అతి పిన్న వయస్కుడిగా యువరాజ్ నిలిచాడు.

# టీ20 ర్యాంకింగ్స్... నెం.1 అభిషేక్ దే..

## టాప్-10లోకి ఎంటరైన ఇషాన్ కిషన్



అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) తాజాగా విడుదల చేసిన టీ20 ప్లేయర్ ర్యాంకింగ్స్‌లో భారత ఓపెనర్ అభిషేక్ శర్మ తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న టీ20 ప్రపంచకప్‌లో అతను పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నప్పటికీ, బ్యాటింగ్ జాబితాలో నంబర్ వన్ ర్యాంక్‌ను కాపాడుకోవడం విశేషం. మరోవైపు, విధ్వంసక వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ మరిన్ని స్థానాలు ఎగబాకి టాప్-10లోకి ప్రవేశించాడు.


టీ20 ప్రపంచకప్‌లో భాగంగా అమెరికా, పాకిస్థాన్‌లపై డకౌట్ అయిన అభిషేక్ ఫామ్ గురించి ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అయినప్పటికీ, అతను బ్యాటింగ్ శిఖరాగ్రాన తన ఆధిక్యాన్ని కొనసాగించాడు. ఇక, ప్రపంచకప్‌లో వరుసగా రెండో హాఫ్ సెంచరీ నమోదు చేసిన ఇషాన్ కిషన్ ఏకంగా 17 స్థానాలు మెరుగుపరుచుకుని 8వ ర్యాంకును దక్కించుకున్నాడు. కేవలం 40 బంతుల్లో 77 పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు గెలుచుకోవడం అతనికి కలిసొచ్చింది. శ్రీలంక ఆటగాడు పతుమ్ నిస్సంక మూడో స్థానానికి చేరుకున్నాడు.

ఆల్ రౌండర్ల జాబితాలో పాకిస్థాన్‌కు చెందిన సైమ్ అయూబ్ అగ్రస్థానానికి చేరుకున్నాడు. భారత్‌పై మూడు వికెట్ల ప్రదర్శనతో, జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజాను వెనక్కి నెట్టి నంబర్ వన్ అయ్యాడు.

బౌలర్ల ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘనిస్థాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ ఒక స్థానం ఎగబాకి రెండో ర్యాంకుకు చేరుకున్నాడు. దీంతో అగ్రస్థానంలో ఉన్న భారత బౌలర్ వరుణ్ చక్రవర్తికి అతను మరింత చేరువయ్యాడు. భారత బౌలర్లు అక్షర్ పటేల్ (14వ ర్యాంక్), జస్ప్రీత్ బుమ్రా (15వ ర్యాంక్) కూడా తమ స్థానాలను మెరుగుపరుచుకున్నారు.





## సందీప్ వంగా దర్శకత్వంలో
# మహేశ్‌బాబు నెక్ట్స్ మూవీ



దర్శక దిగ్గజం రాజమౌళి తెరకెక్కిస్తున్న 'వారణాసి' సినిమా షూటింగ్ లో బిజీగా ఉన్న సూపర్ స్టార్ మహేశ్ బాబు తర్వాతి ప్రాజెక్ట్ గురించి ఫ్యాన్స్, ట్రేడ్ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. తాజాగా విశ్వసనీయ సమాచారం ప్రకారం మహేశ్ నెక్ట్స్ సినిమా అత్యంత క్రేజీ కాంబినేషన్ లో ఫిక్స్ అయింది. మహేశ్ బాబు, సందీప్ రెడ్డి వంగా కలయికలో సినిమా తెరకెక్క బోతోంది. ఏషియన్ సినిమాస్ బ్యానర్ పై టాలీవుడ్ బడా నిర్మాత సునీల్ నారంగ్ ఈ భారీ చిత్రాన్ని నిర్మించబోతున్నారు. సినిమాకు సంబంధించి ఇప్పటికే చర్చలు ముగిసినట్లు ఫిల్మ్ నగర్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. 'వారణాసి' షూటింగ్ ముగిసిన వెంటనే సందీప్ వంగా సినిమా సెట్స్ పైకి వెళ్తుంది. సందీప్ ఇప్పటికే మహేశ్ కోసం ఒక పవర్‌ఫుల్ స్క్రిప్ట్ సిద్ధం చేశారని సమాచారం. సందీప్ వంగా తన సినిమాల్లో హీరోలను చూపించే వైల్డ్ స్టైల్, మహేశ్ బాబు క్లాస్, మాస్ అప్పీల్... వీరి కాంబినేషన్ పై అంచనాలను అమాంతం పెంచేస్తున్నాయి.

మరోవైపు, మహేశ్ బాబు, సునీల్ నారంగ్ మధ్య వ్యాపార అనుబంధం (ఏఎంబీ సినిమాస్) ఉందనే విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ వేగంగా ఓకే అవ్వడానికి వీరి వ్యాపార అనుబంధం కూడా ప్రధాన కారణమని తెలుస్తోంది.

# రజనీకాంత్ 'కొచ్చాడయాన్'కు ఏఐ హంగులు



సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా నటించిన మూవీ కొచ్చాడయాన్. 2014లో విడుదలైన ఈ యాక్షన్ - అడ్వెంచర్ మూవీ బాక్సాఫీస్ వద్ద అభిమానులను ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయింది. బాలీవుడ్ భామ దీపికా పదుకొణె ఇందులో హీరోయిన్‌గా కనిపించింది.

మోషన్ క్యాప్చర్ టెక్నాలజీతో తెరకెక్కిన ఈ మూవీ అప్పట్లో విస్తృత చర్చకు దారి తీసింది. విజువల్స్ కార్టూన్ సినిమాను తలపిస్తున్నాయంటూ ప్రేక్షకుల నుంచి విమర్శలు, ట్రోల్స్ కూడా ఎదురయ్యాయి.

అయితే తాజాగా ఈ మూవీకి సరికొత్త హంగులతో టీజర్ విడుదలైంది. ఏఐ సాయంతో రూపొందించిన ఈ టీజర్ తలైవా అభిమానులను ఆకట్టుకుంటోంది. అంతేకాదు, మొత్తం సినిమాన్నే ఏఐ టెక్నాలజీతో రీ - జనరేట్ చేసే ప్రయత్నాలు సాగుతున్నట్లు సమాచారం. ఈ చిత్రానికి రజనీకాంత్ కూతురు సౌందర్య రజనీకాంత్ దర్శకత్వం వహించిన విషయం విదితమే.

# 'వారణాసి'లో ప్రకాష్‌రాజ్

మహేష్‌బాబు-రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమా 'వారణాసి'. ఈ సినిమాలో శివుడి భక్తుడిగా ప్రకాష్‌రాజ్ నటిస్తున్నారు. తాజాగా మీడియాకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని వెల్లడించారు. హిందీ 'దృశ్యం 3'లోనూ ఓ కీలక పాత్రలో నటిస్తున్నట్లు తెలిపారు. రాజమౌళి దర్శకత్వంలో ప్రకాష్‌రాజ్ ఇప్పటికే 'విక్రమార్కుడు'లో నటించిన విషయం విధితమే. మహేష్‌బాబుతో కూడా ఆయన కలిసి ఒక్కడు, రాజకుమారుడు, గుంటూరు కారం వంటి పలు సినిమాల్లో నటించి మెప్పించారు. ఇప్పుడు వారణాసిలో వీరిద్దరూ మరోసారి కలిశారు. మైథలాజికల్ మూవీగా అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ ప్రాజెక్ట్‌లో ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ప్రస్తుత షెడ్యూల్ జార్జియాలో త్వరలో ప్రారంభం కానుంది. ఆ తర్వాత అంటార్కిటికాలోనూ ప్లాన్ చేశారని సమాచారం. కె.ఎల్.నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తున్న ఈ సినిమా 2027 ఏప్రిల్ 7న విడుదల కానుంది.








Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**